# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 11 సంచిక : 87 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శుక్రవారం 31 జులై 2026 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:11 Issue : 87 31-7-2026 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## నారాయణపురం
## ఆనకట్టకు భారీగా వరద నీరు



బూర్జ : శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం లాభాం పంచాయతీ వద్ద జిల్లాలోని ప్రధాన నీటివనరుల్లో ఒకటి నాగావళి నదిపై నిర్మించిన నారాయణపురం అనకట్ట. ఒడిశాలో వర్షాలు కారణంగా అనకట్ట వద్దకు భారీగా వరదనీరు చేరుతోంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో అనకట్టకు సుమారు 1000 క్యూసెక్కుల నీరు చేరడం రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని ఏడు మండలాల్లో 37,053 ఎకరాలకు కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా నీరు అందుతుందని జలవనరుల శాఖ ఏఈ రామశివాజీ తెలిపారు.



## వందేమాతరం బిల్లుకు
# లోక్ సభ ఆమోదం

- వందేమాతరం అవమానాన్ని నేరంగా పరిగణించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి చట్టపరమైన రక్షణ
- అవమానిస్తే మూడేళ్ల జైలు, జరిమానా విధించేలా కఠిన నిబంధనలు
- ఉభయ సభల ఆమోదంతో రాష్ట్రపతి పరిశీలనకు చేరనున్న బిల్లు

**న్యూఢిల్లీ :** జాతీయ గేయం వందేమాతరాన్ని అవమానించడం లేదా దాని గానానికి ఆటంకం కలిగించడాన్ని నేరంగా పరిగణించే కీలక బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం ముద్ర వేసింది. జాతీయ గౌరవ పరిరక్షణ (సవరణ) బిల్లు, 2026ను ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. నిన్న ఈ బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందింది. 1971 నాటి జాతీయ గౌరవ పరిరక్షణ చట్టానికి ఈ బిల్లు సవరణలు చేపడుతుంది. ఇప్పటివరకు జాతీయ జెండా, రాజ్యాంగం, జాతీయ గీతం 'జన గణ మన'కు మాత్రమే ఉన్న చట్టపరమైన రక్షణ ఇకపై వందేమాతరం గేయానికి కూడా వర్తించనుంది. నూతన నిబంధనల ప్రకారం, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వందేమాతరం గానానికి ఆటంకం కలిగించినా లేదా దానిని అవమానించినా గరిష్టంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. కేంద్ర హోంశాఖ

- తరువాయి 4లో..

## పేపర్ లీక్ ముఠాలను
# ఇక సహించేది లేదు..
## ఇన్‌స్టాలో మోదీ కొత్త సందేశం

- పేపర్ లీకులను అరికట్టే సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం
- స్వాగతించిన ప్రధాని నరేంద్ర మోదీ
- పేపర్ లీక్ మాఫియాపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టీకరణ
- పరీక్షల వ్యవస్థను పటిష్ఠం చేయడానికి సంస్కరణలు చేపట్టినట్లు వెల్లడి
- విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ



పబ్లిక్ పరీక్షల్లో పేపర్ లీకులను అరికట్టే సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేసిన ఆయన.. పేపర్ లీక్ మాఫియాపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలన్నీ పేపర్ లీకుల సమస్యను ఎదుర్కొన్నాయని మోదీ గుర్తుచేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగాన్ని పెంచడం, వేగవంతమైన వ్యవస్థలను అమలు చేయడం, పారదర్శకతను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొత్త చట్టంతో పేపర్ లీక్ ముఠాలపై మరిన్ని కఠిన చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## విశాఖ రైల్వేకు శుభవార్త..
## రూ.299 కోట్లతో
# కొత్త లైన్లు, ప్లాట్‌ఫారాలు

ఆరు కొత్త లైన్లు, ప్లాట్‌ఫారాల నిర్మాణం

రైళ్ల ఆలస్యం, రద్దీ తగ్గించడమే లక్ష్యం

తూర్పు వైపు కొత్త ప్రవేశ ద్వారం

విశాఖ రైల్వే స్టేషన్ నుంచి రోజూ సుమారు 80 వేల మంది ప్రయాణం




**విశాఖపట్నం, జులై 30 తెలుగురాష్ట్రం ప్రతినిధి** విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో పెరుగుతున్న రద్దీకి చెక్ పడనుంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రైళ్ల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రూ.299 కోట్లతో విశాఖ కోచింగ్ యార్డు ఆధునికీకరణకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుతో స్టేషన్ నిర్వహణ సామర్థ్యం పెరగడంతో పాటు రైళ్ల ఆలస్యం తగ్గే అవకాశం ఉంది. దక్షిణ కోస్ట్ రైల్వే పరిధిలోని విశాఖపట్నం కోచింగ్ యార్డును పూర్తిగా పునర్వ్యవస్థీకరించనున్నారు. ఇందులో ఆరు కొత్త లైన్లు, అదనపు ప్లాట్‌ఫారాలు నిర్మించనున్నారు. ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఉన్న ఆరు ప్లాట్‌ఫారాలను కూడా విస్తరించనున్నారు. దీంతో యార్డులో రద్దీ తగ్గి రైళ్ల కదలిక మరింత వేగంగా సాగనుంది. ప్రస్తుతం విశాఖ రైల్వే స్టేషన్ నుంచి రోజూ సుమారు 80 వేల మంది

- తరువాయి 4లో..

## సాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు
## ప్రత్యామ్నాయ మార్గాలపై
# దృష్టిసారించాలి..

### ఎల్ నినో ప్రభావం, సాగునీటి పరిస్థితులపై
### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష




**అమరావతి, జులై 30 తెలుగురాష్ట్రం ప్రతినిధి**ఆంధ్రప్రదేశ్‌లో సూపర్ ఎల్ నినో ప్రభావం, సాగునీటి పరిస్థితులపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సాగునీటి పరిస్థితులు, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను పవన్ కు వివరించారు. రైతులు ఆందోళన చెందకుండా వాస్తవ పరిస్థితులను తెలియజేయడంతో పాటు సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని పవన్ సూచించారు. సూపర్ ఎల్ నినో ప్రభావంపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు డిప్యూటీ సీఎం ఆదేశించారు. రైతులతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించి

- తరువాయి 4లో..

## యాక్సిడెంట్ కేసును
# హత్యగా మార్చారు..
## జగన్ కీలకవ్యాఖ్యలు

**అమరావతి, జులై 30 తెలుగురాష్ట్రం ప్రతినిధి**

శ్రీకాకుళం జిల్లా అంపోలు జైలు పరిసర ప్రాంతంలో వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వం మరియు పోలీసు వ్యవస్థ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్టు మరియు ఆయనపై నమోదు చేసిన కేసుల అంశంపై స్పందించిన జగన్, ప్రభుత్వం కావాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సాధారణంగా జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని

- తరువాయి 4లో..





## ముగిసిన సమయం..
## శ్రీకాకుళం జైలు వద్ద జగన్, సీదిరి అప్పలరాజుల
# ములాఖత్ రద్దు

- శ్రీకాకుళం అంపోలు జైల్లో రిమాండ్‌లో ఉన్న సీదిరి అప్పలరాజు
- ములాఖత్ లో కలిసేందుకు వెళ్లిన జగన్
- సాయంత్రం 5 గంటలు దాటడంతో అనుమతి నిరాకరించిన జైలు అధికారులు

**అమరావతి, జులై 30 తెలుగురాష్ట్రం ప్రతినిధి**

రోడ్డు ప్రమాదం కేసులో అరెస్టయి శ్రీకాకుళం అంపోలు జైల్లో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో వైసీపీ అధినేత జగన్ ములాఖత్ చివరి నిమిషంలో రద్దయింది. ములాఖత్ కోసం జగన్ కు జైలు అధికారులు సాయంత్రం 5 గంటల వరకు సమయం ఇచ్చారు. అయితే జైలు వద్దకు జగన్ చేరుకునే సమయానికి నిర్ణీత గడువు ముగిసిపోయింది. సమయం దాటిన తర్వాత కూడా అప్పలరాజును కలిసేందుకు వైసీపీ నేతలు అనుమతి కోరగా, జైలర్ ఉన్నతాధికారులతో సంప్రదించారు. జైలు నిబంధనల ప్రకారమే నడుచుకోవాలని, సాయంత్రం 5 గంటల దాటిన తర్వాత ఎలాంటి ములాఖత్‌కు అనుమతి లేదని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. జైలు నిబంధనల దృష్ట్యా అధికారుల నుంచి అనుమతి లభించకపోవడంతో జగన్, సీదిరి అప్పలరాజుల ములాఖత్ రద్దయింది. అనంతరం జైలు ప్రాంగణం వద్దే వేచి ఉన్న అప్పలరాజు కుటుంబ సభ్యులను జగన్ కలిసి పరామర్శించారు.

# ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్

- గత ప్రభుత్వ చర్యలతో పెట్టుబడిదారుల విశ్వాసం కోల్పోయింది
- త్వరలో ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు క్లీన్ ఎనర్జీ ఎగుమతులు
- పరిశ్రమలు తేవడం మా బాధ్యత -- కష్టపడటం యువత బాధ్యత
- టాటా రెన్యువబుల్ ఎనర్జీ శంకుస్థాపన సభలో మంత్రి నారా లోకేష్






**పత్తికొండ, జులై 30 తెలుగురాష్ట్రం ప్రతినిధి**

. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల తొలి ఎంపిక అయ్యిందని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్, EQT, TPG వంటి గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని, టాటా పవర్, సుజ్లాన్, రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, ూజవీజు, వారీ వంటి ప్రముఖ భారతీయ కంపెనీలు ఇక్కడ విస్తరిస్తున్నాయని లోకేష్ వెల్లడించారు.

పత్తికొండ సమీపంలోని హోసూరులో టాటా పవర్ రెన్యూవబుల్

- తరువాయి 4లో..



# సంపాదకీయం

## పర్యావరణ పరిరక్షణకై ‘చెత్త’పై పోరాటం

స్రుతీఝుస్రవ : మహారాష్ట్రలోని మోషి వేస్టు ఎనర్జీ ప్రాజెక్టు వద్ద భారీ వర్షాలకు ఏళ్ల తరబడి పేరుకుపోయిన లెగసీ వ్యర్థాల కొండ విరిగిపడి పరిపాలనా భవనాన్ని సజీవ సమాధిచేసిన ఘటన దేశాన్ని కుదిపేసింది. ఒక కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. పలువురు గాయపడ్డారు. కానీ ఈ దుర్ఘట నను కేవలం ప్రకృతి వైపరీత్యంగా చూడడం వాస్తవాన్ని కప్పిపుచ్చడమే అవుతుంది. ప్రకృతి చెత్త కొండలను నిర్మిం చదు. పాలనా నిర్లక్ష్యం, కార్పొరేట్ లాభాల రాజకీయాలు, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలే వాటిని నిర్మిస్తాయి. మోషిలో కూలింది చెత్త కొండ కాదు, ప్రజల భద్రత కంటే లాభాలను ముందుపెట్టిన పట్టణ అభివృద్ధి నమూనా. ఈ హెచ్చరిక మహారాష్ట్రకే పరిమితం కాదు. హైదరాబాద్కు ఇది మరింత దగ్గరగా వినిపించాలి. ఎందుకంటే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజూ సుమారు 8,000 టన్నుల మున్సిపల్ ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని జీహెచ్ఎంసీ స్వయంగా అంగీకరించింది. అంతేకాదు, ఈవ్యర్థాలను ప్రధా నంగా జవహర్ నగర్ సమీకృత వ్యర్థాల నిర్వహణ కేంద్రం పైనే ఆధారపడి నిర్వహించడం ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2016కు అనుగుణం కాదని కూడా అధికారి కంగా పేర్కొంది. అంటే ప్రమాదం గురించి ప్రజలకు మాత్రమే కాదు, ప్రభుత్వానికి కూడా తెలుసు. అయినప్ప టికీ పరిస్థితి ఎందుకు మారడం లేదు?

**: ప్రమాదకర వ్యర్థాలు**

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు-2016 స్పష్టంగా చెబుతున్నాయి. చెత్తను మూలం వద్దనే తడి-పొడి- ప్రమాదకర వ్యర్థాలుగా వేరు చేయాలి. నగరాలన్నీ వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను అభి వృద్ధి చేయాలి. శాస్త్రీయ ల్యాండ్ఫిల్ చివరి ప్రత్యామ్నా యంగా మాత్రమే ఉండాలి. భారీ చెత్త కొండలను సృష్టిం చడం ఈ నియమాల ఆత్మకు విరుద్ధం. అయినప్పటికీ హైదరాబాద్ నగరమంతా ఉత్పత్తి చేసే వ్యర్థాలను జవ హర్నగర్కు తరలించే కేంద్రీకృత నమూనా కొనసాగుతూనే ఉంది. ఇదే మోషి వంటి ప్రమాదాలకు పునాది. జవహర్ నగర్ కథ కొత్తది కాదు. ఒకప్పుడు మన్సూరాబాద్లో ప్రజలు చెత్త కాలుష్యాన్ని అనుభవించారు. తర్వాత సమ స్యను అక్కడి నుంచి తరలించి జవహర్నగర్కు చేర్చారు. నగరం పెరిగే కొద్దీ ఆటోనగర్, సనత్నగర్, ఇమ్లీబన్ వంటి ట్రాన్స్ఫర్ స్టేషన్లు ఏర్పడ్డాయి. కానీ మూల సమస్యమాత్రం అలాగే ఉంది. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామా బాద్, మహబూబ్నగర్ వంటి తెలంగాణ నగరాల్లోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది. ఒక ప్రదేశం నిండిపోతే మరో ప్రదేశం వెతకడం తప్ప, చెత్త ఉత్పత్తి విధానాన్ని, నిర్వహణ నమూ నాను మార్చే ప్రయత్నం కనిపించడం లేదు. ఇక్కడే ‘చెత్త రాజకీయం’ ప్రారంభమవుతుంది. ప్రతి ఎన్నికల సమయం లో జవహర్ నగర్ ప్రజలకు హామీలు ఇవ్వని రాజకీయ పార్టీఉండదు. డంపింగ్ యార్డు తరలిస్తామని, కాలుష్యాన్ని నివారిస్తామని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతామని చెబు తారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే మౌనం. ఎందుకు? దీనికి సమాధానం కేవలం రాజకీయాల్లో కాదు, రాజకీయ ఆర్థిక వ్యవస్థలో ఉంది.

**నియంత్రణ వ్యవస్థ బలహీనం**

ఒకప్పుడు మున్సిపల్ పారిశుద్ధ్య పనిగా ఉన్న వ్యర్థాల నిర్వహణ ఇప్పుడు వేల కోట్ల రూపాయల ఆర్థిక రంగంగా మారింది. చెత్త సేకరణ, రవాణా, ప్రాసెసింగ్, లీడేట్ శుద్ధి, ల్యాండ్ఫిల్ నిర్వహణ, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, ప్రతిదశలో భారీ కాంట్రా క్టులున్నాయి. జవహర్నగర్ సమీకృత వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులో రామ్కీ ఎన్విరో ఇంజనీర్స్ (ప్రస్తుతం రీ సస్టైన బిలిటీ గ్రూప్లో భాగం) దీర్ఘకాలంగా భాగస్వామిగా ఉంది. జిహెచ్ఎంసి రాంకీ భాగస్వామ్యం 2009లో కుదిరిన కన్సె షన్ ఒప్పందం కింద అమలవుతోందని ప్రభుత్వ పత్రాలే చెబుతున్నాయి. ఇక్కడ ఒక ప్రశ్న వేయడం ప్రజాస్వామ్య హక్కు, వేల కోట్ల ప్రజాధనం, దశాబ్దాల ఒప్పందాలు, కార్పొరేట్ భాగస్వామ్యాలు ఉన్న ఈరంగంలో ప్రజారోగ్యం, పర్యావరణ భద్రతకు ప్రాధాన్యం దక్కుతోందా? లేక కాం ట్రాక్టుల నిరంతరత్వానికా? ఈ ప్రశ్నను మరింత తీవ్రతరం చేసింది కాగ్ నివేదిక, ప్రాసెస్ చేయని వ్యర్థాలకు కూడా భారీ మొత్తంలో చెల్లింపులు జరిగాయని, పర్యవేక్షణలో తీవ్రమైన లోపాలున్నాయని, నియంత్రణ వ్యవస్థ బలహీ నంగా ఉందని అది పేర్కొంది. అంతటితో ఆగలేదు. జవ హర్నగర్లో తాజా వ్యర్థాల దంపింగ్పై ఎన్జీటి ఇచ్చిన ఆదేశాల అమలులో లోపాలపై జిహెచ్ఎంసి, రాంకీ రెం డింటినీ సంయుక్తంగా బాధ్యులుగా పేర్కొంటూ జరిమానా కూడా విధించింది. ఇది కేవలం పరిపాలనా లోపం కాదని, బాధ్యత ప్రశ్నను తప్పించలేమని సూచించే పరిణామం. ఇక్కడితో సమస్య ముగియదు. ఈమొత్తం వ్యవస్థను పర్య వేక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం పాత్ర మరింత ఆం దోళన కలిగిస్తోంది.

**శాశ్వత పరిష్కారాలు కనిపించడం లేదు**

ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు2016 అమలును నిర్ధారించడం స్థానిక సంస్థలతో పాటు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి టిజిపిసిబిబాధ్యత కూడా. లీచేట్ శుద్ధి, భూగర్భ జలాల నాణ్యత, ల్యాండ్ఫిల్ గ్యాస్ నియంత్రణ, గాలి కాలుష్య ప్రమాణాలు, పర్యావరణ అనుమతుల అమలు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ జరగాలి. కానీ జవహర్ నగర్ చుట్టుపక్కల ప్రజలు ఏళ్లుగా దుర్వాసన, కలుషిత నీరు, పొగ, ఈగలు, దోమలు, ఆరోగ్య సమస్యలపై ఆందోళనలు వ్యక్తంచేస్తున్నప్పటికీ, వాటికి తగిన స్థాయిలో శాశ్వత పరిష్కారాలు కనిపించడం లేదు. చెత్త లోని రసాయనాలు, లోహాలు, విష పదార్థాలు కలిసిన ఈ కలుషిత ద్రవం వర్షాల సమయంలో భూమిలోకి ఇంకితే భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. పర్యా వరణ నిపుణులు సంవత్సరాలుగా ఇదే హెచ్చరిక చేస్తున్నారు. పైకి కనిపించేది చెత్త కొండ మాత్రమే. కానీ కింద నిశ్శ బ్దంగా కలుషితమవుతున్నది నేల, నీరు, చివరకు ప్రజల ఆరోగ్యం. ఈ కాలుష్యానికి అత్యధిక మూల్యం చెల్లిస్తున్న వారు ఎవరు? నగర సంపదను నిర్మించే శ్రమజీవులే. డంపింగ్ యార్డులు, ట్రాన్స్ ఫర్ స్టేషన్లు, వ్యర్థాల ప్రాసె సింగ్ కేంద్రాలు ఎక్కు వగా దళితులు, బీసీలు, గిరిజనులు, ముస్లింలు, వలస కార్మికులు, అసంఘటిత రంగ శ్రామి కులు నివసించే ప్రాం తాలకే చేరువలో ఉన్నాయి. అదే నగరంలోని అత్యంత ఖరీదైన నివాస ప్రాంతాల్లో ఇలాంటి ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలనే ఆలోచనే ఎందుకు రాదు? వ్యాధులు, చర్మసమస్యలు, కలుషిత నీటి ప్రభావాలు అణ గారిన వర్గాలకా? ఇదే నేటి చెత్త రాజకీయం. ఈ రాజకీ యాన్ని మార్చకుండా డంపింగ్ యార్డులు మారినా, ప్రభు త్వాలు మారినా, ప్రమాదాలు మాత్రం మారవు. అందుకే చెత్తపై పోరాటం పారిశుద్ధం కోసం మాత్రమే కాదు, ప్రజల జీవించే హక్కుకోసం, పర్యావరణ న్యాయం కోసం, రాజ్యాం గబద్ధమైన సమానత్వం కోసం సాగాల్సిన ప్రజా ఉద్యమం

## వందేమాతరం బిల్లుకు లోక్ సభ ఆమోదం

సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి సమున్నత గౌరవం కల్పించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా వివరించారు. సభలో చర్చ కొనసాగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు ఇతర అంశాలపై పట్టుబడుతూ నిరసనలు వ్యక్తం చేయగా, వారు ప్రతిపాదించిన సవరణలను సభ తోసిపుచ్చింది. వందేమాతరం 150వ వార్షికోత్సవాల నేపథ్యంలో ఈ బిల్లును తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## విశాఖ రైల్వేకు శుభవార్త.. రూ.299 కోట్లతో కొత్త లైన్లు, ప్లాట్‌ఫారాలు

ప్రయాణిస్తున్నారు. సగటున 113 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుత యార్డు నిర్మాణం కారణంగా టెర్మినేటింగ్ రైళ్లు, ఇతర రైళ్లు ఒకే మార్గాలను దాటాల్సి వస్తోంది. దీనివల్ల అప్రోచ్ సిగ్నల్ల వద్ద రైళ్లు నిలిచిపోవడం, ప్లాట్‌ఫారాల లభ్యత తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కొత్త ప్రాజెక్టు పూర్తైతే ఈ సమస్యలు గణనీయంగా తగ్గనున్నాయి. రైళ్ల నిలిపివేత సమయం తగ్గుతుంది. ప్లాట్‌ఫారాల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. భవిష్యత్తులో మరిన్ని రైళ్లను నిర్వహించే వీలుంటుంది. తూర్పు వైపు కొత్త ప్రవేశ ద్వారం నిర్మించడంతో పాటు ప్రయాణికుల రిజర్వేషన్ కేంద్రాన్ని కూడా కొత్త ప్రదేశానికి తరలించనున్నారు.

## సాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిసారించాలి..

వాతావరణ పరిస్థితులు, ప్రభుత్వ చర్యలు, సాగునీటి లభ్యతపై స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. అలాగే ప్రతి రైతు ప్రధాని ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా చేయించుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రస్తుతం ప్రతి నీటి బొట్టు విలువైనదేనని, నీటి వృధాను పూర్తిగా అరికట్టాల్సిన అవసరం ఉందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కాలువల్లో పూడిక తొలగింపు, గట్ల లీకేజీల మరమ్మతులు చేపట్టి నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సాగునీటి సంకోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ప్రత్యామ్నాయ చర్యలు అమలు చేయాలని సూచించారు. ఇదే సందర్భంగా కాకినాడ జిల్లా పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏలేరు నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మంత్రి నిమ్మల రామానాయుడు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఏలేరు ఆయకట్టు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను పరిశీలించిన మంత్రి, పరిస్థితులను పవన్‌కు వివరించారు. రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, సాగునీటి నిర్వహణలో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..

## యాక్సిడెంట్ కేసును హత్యగా మార్చారు..

(యాక్సిడెంట్) కుట్రపూరితంగా హత్య కేసుగా చిత్రీకరించి, అప్పలరాజును మరియు ఆయన కుటుంబాన్ని ఈ కేసులో బలవంతంగా ఇరికించారని మండిపడ్డారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ముందస్తు ప్రణాళిక ప్రకారం ఈ తరహా అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు.

**మాఫియా పాలన నడుస్తోంది.. ఎల్లో మీడియా కథనాలే కేసులా?: జగన్ ధ్వజం**

ప్రస్తుత ప్రభుత్వంలో కొంతమంది అధికారులు, అధికార పార్టీ నేతలు కలిసి ఒక మాఫియాలాగా వ్యవహరిస్తున్నారని వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. నిష్పక్షపాతంగా విచారణ జరపాల్సిన పోలీసులు, ఎల్లో మీడియా ప్రచారం చేసే కట్టుకథలనే ప్రాతిపదికగా తీసుకుని కేసులు నమోదు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీదిరి అప్పలరాజు కుటుంబానికి వైఎస్సార్సీపీ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని, ఇలాంటి అక్రమ కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. చట్టపరంగా మరియు రాజకీయంగా ఈ అన్యాయాన్ని ఎండగడతామని, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

## ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్

ఎనర్జీ లిమిటెడ్ (TPREL) ఆధ్వర్యంలో రూ.5,350కోట్లతో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో




ఏర్పాటుచేయబోయే 800 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు గురువారం మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ... గత ఏడాదితో పోలిస్తే, ఈ ఒక్క సంవత్సరంలోనే ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 400% పెరిగిందని, ఇది రాష్ట్ర విశ్వసనీయతను పునరుద్ధరించడం వల్లే సాధ్యమైందన్నారు.



**పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంపొందించాం**

రాష్ట్రంలో 2024 జూన్ లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు, పునరుత్పాదక ఇంధన రంగం పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండేది. అంతకుముందు ఐదేళ్లలో కనీసం ఒక్క మెగావాట్ సామర్థ్యం గల ప్రధాన రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేశారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం దెబ్బతింది. ప్రపంచంలోని అనేక అతిపెద్ద ఇన్ఫ్రా, క్లైమెట్ ఫండ్స్ ఆంధ్రప్రదేశ్‌ను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాయి. ఒకసారి దెబ్బతిన్న విశ్వాసాన్ని పునరుద్ధరించడం రాత్రికి రాత్రే సాధ్యంకాదు. పెట్టుబడిదారుల్లో మళ్లీ నమ్మకాన్ని పెంపొందిస్తూ వచ్చాం.

**ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీతో తొలిఅడుగు**

ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024ను ప్రవేశపెట్టి విస్తృతమైన విజన్‌తో 160 గిగావాట్ల (GW) క్లీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. సోలార్ మాడ్యూల్స్, సెల్స్ నుండి బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, ట్రాన్స్ మిషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పోర్ట్స్, స్టోరేజీ సిస్టమ్స్... ప్రపంచ స్థాయి తయారీ వరకు - మొత్తం క్లీన్ ఎనర్జీ సప్లయ్ చైన్ ను ఆంధ్రప్రదేశ్ లో నిర్మించాలని అనుకున్నాం. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగించుకోవడమే కాకుండా, క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలకు గ్లోబల్ ప్రొడ్యూసర్ గా మారాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

**టాటా రెన్యువబుల్ ప్రాజెక్ట్.. మా విజన్ కు నిదర్శనం**

టాటా రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ ?5,750 కోట్ల పెట్టుబడితో, పత్తికొండలో 400 మెగావాట్ల సౌర విద్యుత్‌ను, అనంతపురం జిల్లా కనేకల్లులో 400 మెగావాట్ల పవన విద్యుత్‌తో కలిపి, 800 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుగా అవతరించబోతోంది. ఈ ఒక్క ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో దాదాపు 4,000 ఉద్యోగాలను కల్పిస్తుంది. 3,400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గల ఈ ప్రాజెక్టు ద్వారా 1,100 పైగా రైతు కుటుంబాలకు దాదాపు మూడు దశాబ్దాల పాటు స్థిరమైన కౌలు ఆదాయాన్ని అందిస్తుంది. ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌పైనా, మా పరిపాలనపైనా విశ్వాసానికి ప్రతీక.

**టాటా గ్రూప్ తో మాకు ప్రత్యేకమైన అనుబంధం**

టాటా గ్రూప్‌తో మాకు దశాబ్దాల తరబడి అనుబంధం ఉంది. 1990లో నా తండ్రి చంద్రబాబు నాయుడు గారు హైదరాబాద్‌లో ‘హైటెక్ సిటీ’ని నిర్మిస్తున్నప్పుడు, ఆయన దార్శనికతను నమ్మిన మొట్టమొదటి సంస్థలలో టిసిఎస్ ఒకటి. ఆ నమ్మకంతో కూడిన అనుబంధం నేటికీ కొనసాగుతోంది. 2024లో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, నేను టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్‌ను కలిసి ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడానికి ఆంధ్రప్రదేశ్ భిన్నంగా ఏమి చేయాలి అని అడిగాను. “వేగంపై దృష్టి పెట్టండి. పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాల కంటే జాప్యం వల్ల కలిగే నష్టమే ఎక్కువ,” అని ఆయన చెప్పారు. మా ప్రభుత్వ విధానం కూడా ాఊఎజూశ్రీవ, ాజూవవఎ, శ్ఖుఎఙశ్రీఙఎ లో వేగం భాగం అయ్యింది. శంకుస్థాపన నుండి ప్రారంభోత్సవం వరకు ప్రభుత్వం మద్దతుగా నిలబడుతుందనే విశ్వాసం మేము పెట్టుబడిదారులకు కల్పిస్తున్నాం.

**స్వచ్ఛ ఇంధనం ఎగుమతి చేస్తాం**

భారతదేశంలోనే అత్యంత పొడవైన తీరప్రాంతం, సమృద్ధిగా పునరుత్పాదక వనరులు, ప్రపంచ స్థాయి ఓడరేవులు ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఎగుమతులకు భారతదేశపు ముఖద్వారంగా మారడానికి మాకు అవకాశం కల్పిస్తున్నాయి. అతి త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి అయ్యే స్వచ్ఛమైన ఇంధనాన్ని తీసుకువెళ్లే ఓడలు యూరప్, జపాన్, కొరియా, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తాయి. క్లీన్ మాలిక్యులస్, గ్రీన్ ఫ్యూయల్స్, సాంకేతికతలను ఎగుమతులూ ఏపీ నుంచి చేసే స్థాయికి చేరతాం.

**సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కలిసి పనిచేయాలి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐఐటి తిరుపతి, యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (ఆస్ట్రేలియా) సహకారంతో సోలార్ మ్యానుఫ్యాక్చరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ టెక్నాలజీల కోసం ఏర్పాటు చేస్తున్న ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కలిసి పనిచేయాలని టాటా పవర్‌ను ఆహ్వానిస్తున్నాం. మనం కలిస్తే భారతదేశపు స్వచ్ఛ ఇంధన భవిష్యత్తును నిర్మించే ఇంజనీర్లు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలను తయారు చేయగలం. టాటా రెన్యువబుల్ ఎనర్జీ కార్యరూపం దాల్చడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నాను.

**సుజ్లాన్ కు ప్రత్యేక అభినందనలు**

దశాబ్దాలుగా, భారతదేశ పవన శక్తి రంగంలో సుజ్లాన్ అగ్రగామి పాత్ర పోషిస్తున్న సుజ్లాన్ పవన శక్తి ప్రాజెక్ట్ అభివృద్ధిలో భాగం కావడం ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు గొప్ప బలాన్ని చేకూరుస్తుంది. ఈ ప్రాజెక్ట్ కోసం అవసరమైన విండ్ టర్బైన్‌లను అనంతపురంలోనే సుజ్లాన్ ఏర్పాటు చేసిన కేంద్రంలో తయారు కావడం ఏపీలో సమగ్ర పారిశ్రామిక వ్యవస్థ అభివృద్ధికి మరో నిదర్శనం. విండ్ టర్బైన్‌ల తయారీ, నిర్వహణలో యువతకు నైపుణ్య శిక్షణనిచ్చే కేంద్రాలను కూడా ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో దీర్ఘకాలిక భాగస్వామిగా నిలిచినందుకు సుజ్లాన్ యాజమాన్యం, బృందానికి కృతజ్ఞతలు.

**వజ్రాల నేల..బంగారంలాంటి ప్రజలు**

అశోకుడు పాలించిన గొప్ప నేల పత్తికొండ. పత్తికొండలో యువశక్తి అదిరిపోయింది. బంగారు గనులు ఉన్న ప్రాంతం ఇది, బంగారం లాంటి ప్రజలు ఉన్న నేల ఇది. జొన్నగిరి గోల్డ్ ఇప్పుడు ఏపీకే బ్రాండ్. పత్తికొండ బంగారం గురించి ఇప్పుడు ప్రపంచం మొత్తం మాట్లాడుతుంది. ఈ నేలలో వజ్రాలు దొరుకుతాయి, వజ్రాల లాంటి యువకులు ఇక్కడ ఉన్నారు. పెరవలి రంగనాథ స్వామి ఆలయం, పత్తికొండ సాయిబాబా ఆలయం ఉన్న పుణ్య భూమి పత్తికొండ.

**కర్నూలు ప్రజల అభిమానం మరువలేను**

ఉమ్మడి కర్నూలు జిల్లా అంటే నాకు ఇష్టం. నేను పాదయాత్రలో వచ్చినప్పుడు ప్రజలు చూపిన ప్రేమ ఎప్పటికి మర్చిపోలేను. నేను 45 రోజులు, 14 నియోజక వర్గాల్లో పాదయాత్ర చేసాను. నాకు కర్నూలు జిల్లా ప్రజల సమస్యలు తెలుసు, కష్టాలు, వలసలు నేను చూశాను. నేను పత్తికొండ వచ్చినప్పుడు అప్పటి ప్రభుత్వం నన్ను అడ్డుకోవడానికి 1000 మంది పోలీసులను పంపింది. పత్తికొండ ప్రజలు నాకు మద్దతుగా నిలిచారు. అందుకే మీ రుణం తీర్చుకుంటున్నా. ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నా. గౌరవ ముఖ్యమంత్రి గారు, నేను, మంత్రి టిజి భరత్ ప్రపంచం మొత్తం తిరిగి రాష్ట్రానికి అనేక కంపెనీలు తీసుకొస్తున్నాం. కర్నూలు జిల్లాకు కూడా అనేక పరిశ్రమలు రాబోతున్నాయి. పరిశ్రమలు తీసుకురావం మా బాధ్యత. కానీ కష్టపడి పనిచేయాల్సిన బాధ్యత యువకులపై ఉంది. కష్టం, ప్రతిభ రెండూ ఉండాలి. అప్పుడే కంపెనీలకు నమ్మకం వస్తుంది.

**ఇండస్ట్రీ కనెక్ట్ తో నైపుణ్యాభివృద్ధి**

నాకు ఒక వింత పరిస్థితి ఎదురవుతోంది. మేము కంపెనీ పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం, మీ దగ్గర స్కిల్ ఉన్న యూత్ ఉన్నారా అని కొంతమంది పారిశ్రామికవేత్తలు అడుగుతున్నారు. అందుకే ఇప్పుడు ఐటిఐలని ఇండస్ట్రీతో కనెక్ట్ చేస్తున్నాం. ఒక్కో ఐటీఐని ఒక్కో కంపెనీకి అటాచ్ చేస్తున్నాం. ఇండస్ట్రీకి కావాల్సిన విధంగా యూత్ ని సిద్ధం చేస్తున్నాం. మొన్నే శ్రీసిటీలో యూనివర్సిటీని ప్రారంభించాను. ఇది ఇండియాలోనే నేర్చుకోండి - సంపాదించండి -- గ్రాడ్యుయేట్ అవ్వండి మోడల్‌లో నిర్వహించే తొలి యూనివర్సిటీ. మూడు నెలలు క్లాస్ రూములో, 8 నెలలు ఇండస్ట్రీ లో వర్క్. చదువుకుంటూనే సంపాదిస్తారు. చదువు పూర్తయ్యేసరికి ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలు సంపాదిస్తారు.

**దేశానికి నాయకత్వం వహించే ఏపీని నిర్మిద్దాం**

‘టాటా’ అనే పేరు ఎల్లప్పుడూ నమ్మకం, నిజాయితీ, దేశ నిర్మాణం, ఆవిష్కరణలకు మారుపేరుగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌తో టాటా బంధం చాలా బలీయమైనది. ప్రభుత్వం, పారిశ్రామిక రంగం, రైతులు, ప్రజలు... కలిసి క్లీన్ ఎనర్జీ, పరస్పర విశ్వాసం, భాగస్వామ్య స్ఫూర్తితో కూడిన సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నాం. భారతదేశానికి దిశానిర్దేశం చేసే ఆంధ్రప్రదేశ్‌ను , స్వచ్ఛ ఇంధన రంగంలో ప్రపంచానికే నాయకత్వం వహించే భారతదేశాన్ని మనం కలిసి నిర్మిద్దామని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టాటా పవర్ సిఇఒ ఏ ఎండి ప్రవీర్ సిన్హా, టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ సిఇఓ ఏ ఎండి సంజయ్ బంగా, సుజలాన్ వైస్ చైర్మన్ గిరీష్ తంతి, భారీ పరిశ్రమల మంత్రి టిజి భరత్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, కె.ఇ. శ్యామ్ బాబు, జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి, టాటా పవర్, సుజ్లాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా




తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
శుక్రవారం 31 జులై 2026




## గూడూరు మల్లవోలు వి బి - జి ఆర్ ఏ ఎం జి -నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయం--1 మరియు గ్రామ సచివాలయం--2 భవనాలను ప్రారంభం -ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



**గూడూరు జూలై 30(తెలుగు రాష్ట్రం ప్రతినిధి)**

గూడూరు మండలం, మల్లవోలు గ్రామపంచాయతీలోవి బి - జి ఆర్ ఏ ఎం జి నిధులతో రూ. 87.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం--1 మరియు గ్రామ సచివాలయం--2 భవనాలను, అలాగే రూ. 14.50 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని పెడన నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా, సులభంగా అందించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థ కీలకంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. చిన్నారులకు మెరుగైన విద్యా, పోషకాహార, ఆరోగ్య సేవలు అందించేందుకు అంగన్వాడీ కేంద్రాలు ఎంతోఉపయోగపడతాయని, గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు.ప్రారంభోత్సవం అనంతరం అధికారులు,ప్రజాప్రతినిధులతో కలిసి భవనాలను పరిశీలించి, వాటి ద్వారా గ్రామ ప్రజలకు అందనున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు నాణ్యమైన భవనాల నిర్మాణం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, అభిమానులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నర్సాపురం యునైటెడ్ కాపు వనితా క్లబ్ కి అవార్డుల వెల్లువ

**నరసాపురం ; జూలై 30 తెలుగు రాష్ట్రం ప్రతినిధి.**





నరసాపురం యూనిటెడ్ కాపు వనిత క్లబ్ కి రెండు వేల ఇరువది ఐదు,రెండువేల ఇరువదిఆరుకు సంబంధించిన అవార్డును పాలకొల్లు గ్రామానికి చెందిన అడబాల కళ్యాణ మండపంలో గురువారం జరిగిన అవార్డు కార్యక్రమంలో నర్సాపురం యునైటెడ్ కాపు వనితా క్లబ్ చేసిన సేవలకు గుర్తించి బెస్ట్ క్లబ్, బెస్ట్ సెక్రటరీ, బెస్ట్ ఎన్విరాన్ మెంట్, బెస్ట్ ఎడ్యుకేషన్, బెస్ట్ పబ్లిక్ ఇమేజ్, వివిధ కేటగిరీల్లో గోల్డ్ , సిల్వర్ అవార్డు గెలుచుకోవడం జరిగిందని రాష్ట్ర కమిషన్ మాజీ సభ్యురాలు మరియు ప.గో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డా. శిరిగినీడి రాజ్యలక్ష్మి ఆనందం వ్యక్తంచేశారు. ఈ అవార్డు వలన మరింత బాధ్యత పెరిగిందని రానున్న రోజుల్లో యునైటెడ్ కాపు వనితా క్లబ్ ద్వారా సేవలు అందిస్తామని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో డా.శిరిగినిడి రాజ్యలక్ష్మికి నరసాపురం యూనిటెడ్ కాపు వనితా క్లబ్ అధ్యక్షురాలు బండి స్వర్ణలత, కార్యదర్శి రంగినీడి భరణి , కోశాధికారి సలాది మణికర్ణిక , మరియు వివిధ పార్టీ నాయకులు అభిమానులు ప్రజలు అభినందనలు తెలిపారు

## బద్లావ్ జరూరీ హై-మార్పు అవసరం గోడ పత్రిక ఆవిష్కరించిన సీపీఐ నాయకులు




**పాయకరావుపేట, జులై 30, (తెలుగు రాష్ట్రం ప్రతినిధి )**

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 న న్యూ ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరుగబోయే బద్లావ్ జరూరీ హై-మార్పు అవసరం ర్యాలీకి సంబంధించిన గోడ పత్రికను గురువారం సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు వివరిస్తూ ఆగష్టు 6 నుండి 15 వరకు ప్రచార ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని సిపిఐ జాతీయ సమితి పిలుపునిచ్చిందన్నారు. ఈ మేరకు సెప్టెంబరు 1 న న్యూఢిల్లీ లోని రాంలీలా మైదానంలో బద్లావ్ జరూరీ హ మార్పు అవసరం ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. దరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలనీ, సార్వత్రిక విద్య ఆరోగ్యం అందుబాటులోకి తీసుకుని రావాలని పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనీ డిమాండ్ చేశారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నారు. ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించి మహిళా రిజర్వేషన్లు తక్షణం అమలు చేయాలన్నారు. కార్మికుల హక్కులను పరిరక్షించాలనీ దళిత, ఆదివాసీలపై అకృత్యాలు, దాడులను నిలిపివేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు, చొక్కా వీరబ్బాయి, రమణమ్మ, గోళ్ళ సూర్యప్రకాష్, భద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల డిమాండ్స్ డే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి..

**రంపచోడవరం,జూలై 30(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**



దశాబ్దాలుగా ఏజన్సీ లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్,ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ క్రాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఎప్పుడూ జర్నలిస్టులో సమస్యలపై పోరాడుతూనే ఉంటుందని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పి.రామరాజు గురువారం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నేడు 31 శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది.ఈ నేపథ్యంలో పోలవరం జిల్లా కేంద్రమైన రంపచోడవరంలో కలెక్టరేట్ వద్ద ఉన్న మెయిన్ గేట్ వద్ద జర్నలిస్టుల ప్రధాన సమస్యలపై నిరసన కార్యక్రమానికి మన జర్నలిస్టు మిత్రులందరికీ సంఘీభావం తెలిపి నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మార్చే 'భోగాపురం ఎయిర్‌పోర్ట్'. ఎమ్మెల్యే ఆనందరావు





**అమలాపురం జూలై 30- తెలుగు రాష్ట్రం న్యూస్ గురువారం:**

ఉత్తరాంధ్ర అభివృద్ధికి మైలురాయిగా నిలిచే లిభోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి మరియు భారీ బహిరంగ సభకు భారత ప్రధాని నరేంద్ర మోదీ లి విచ్చేస్తున్న సందర్భంగా. అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు బహిరంగ సభ ఏర్పాట్లను మరియు జన సమీకరణను సమీక్షించటం జరిగింది వరల్డ్ క్లాస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌తో ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మార్చేలా రూపుదిద్దుకున్న ఈ డ్రీమ్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రధాని మోదీ గారి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి.

### - ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ( ఐ ఎల్ ఏ ) డిమాండ్.




**అమలాపురం.. జూలై 30 తెలుగు రాష్ట్రం న్యూస్.**

న్యాయవాదుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని కోరుతూ గురువారం అమలాపురం బార్ అసోసియేషన్ ప్రాంగణంలో న్యాయవాదులు నినదించారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు టి. పృథ్వీరాజ్ మాట్లాడుతూ న్యాయవాదులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు మంజూరు చేయాలని, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాశి శేషారావు మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు నెలకు పదివేలు చొప్పున స్టైఫండ్ ఇవ్వాలని కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు దాకారపు చిరంజీవి మాట్లాడుతూ అర్హులైన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరారు. అనంతరం న్యాయవాదులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ను



కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. న్యాయవాదులు డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేస్తానని కలెక్టర్ మహేష్ కుమార్ న్యాయవాదులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలాపురం బార్ ప్రధాన కార్యదర్శి నల్ల సురేష్ కుమార్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు నల్ల ప్రభాకర్ రావు, ఐ ఎల్ ఏ జిల్లా నాయకులు పియల సత్యనారాయణ, పినిపే వెంకట సత్యనారాయణ, కుంచే శ్రీనివాసరావు, సోమరాజు, భాస్కర్ జోసెఫ్, గుర్రాల రాంబాబు, రోహిణి, డి రాణి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద భారీ నిరసన తెలిపిన కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘాలు

### -కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేసిన మాజీ ఎమ్మెల్సీ ఐ వి



**అమలాపురం జూలై 30 తెలుగు రాష్ట్రం న్యూస్**

కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చేసి, రెగ్యులర్ చేయాలని డిమాండ్అమలాపురం, కలెక్టరేట్ : ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీస వేతనం 26 వేలు చెల్లించాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేసి, రెగ్యులర్ చెయ్యాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అమలాపురం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది అనంతరం కలెక్టర్ గారికి వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జి దుర్గాప్రసాద్ , అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమాదేవి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బి బలరాం, పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారేశీ వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంట్రాక్ట్ ,అవుట్ సోర్సింగ్ జిల్లా జేఏసీ చైర్మన్ బత్తుల శ్రీనివాస్, ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 71 రకాల షెడ్యూల్ పరిశ్రమల్లో వేతనాలను సవరించి 15 ఏళ్లు గడుస్తుందని, 2026 లో కూడా 2011లో నిర్ణయించిన వేతనాలనే నేటికి చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్య కాలంలో నిత్యవసర సరుకుల ధరలు ప్రభుత్వ లెక్కల ప్రకారమే 300% పెరిగాయని, ఈ 15 ఏళ్లలో రాష్ట్రాన్ని పాలించిన ఏ రాజకీయ పార్టీ కూడా కనీస వేతనాలను సవరించకుండా, పెట్టుబడిదారుల లాభాల కోసమే పనిచేసాయని విమర్శించారు. పంజాబు, ఒరిస్సా, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాలలో కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను లక్షల మందిని రెగ్యులర్ చేస్తుంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎందుకు చేయరని ప్రశ్నించారు. తెలంగాణలో కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచి, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అన్ని ప్రభుత్వ డిపార్ట్మెంట్లలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల 8 గంటల పనిని 10:30 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని కార్మికులు ఉద్యోగులు గుర్తుపెట్టుకోవాలన్నారు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్ల ఫలితంగా పరిశ్రమల్లో అధికారుల తనిఖీలను నిలిపివేయడంతో యజమానులు లాభాల కోసం కార్మికుల భద్రత గాలికి వదిలేసారని దాని పర్యవసానమే పరిశ్రమల్లో ప్రమాదాలు పెరగడానికి కారణం అన్నారు. రాష్ట్రంలో కనీస వేతన సలహా మండలి రాజకీయ నిరుద్యోగులకు ఆశ్రయంగా మారిందని ఎద్దేవా చేశారు. జిల్లాలో వేగంగా విస్తరిస్తున్న, షాపింగ్ మాల్స్, ఆక్వా పరిశ్రమల్లో , గ్యాస్ డోర్ డెలివరీ, పెట్రోల్ బంక్ కార్మికులకు కార్మిక చట్టాల అమలు మాటలేదని, కనీస చట్టాలైన పిఎఫ్, ఈఎస్ఐ కూడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికార యంత్రాంగం కలగజేసుకుని కార్మికులకు కనీస చట్టాలు అమలు జరిగేలా చర్యలు చేపట్టకపోతే మరిన్ని పోరాటాలకు సిఐటియు కార్మికులను సిద్ధంచేస్తామని హెచ్చరించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ బాధ్యత వహించే శాఖలో పంచాయతీ కార్మికులకు ఇప్పటికీ 6వేలు మాత్రమే వేతనాలు చెల్లించడం, అదికూడా నెలల తరబడి బకాయిలు పెట్టడం సిగ్గుచేటు అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి జిల్లా కోశాధికారి కే కృష్ణవేణి సిఐటియు ఉపాధ్యక్షులు భాస్కరరావు మిడ్డి మిల్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి నాగ వరలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సకిలే సూర్యనారాయణ , ఇసుక పట్ల మంగాదేవి , స్టేట్ గవర్నమెంట్ కాంటాక్ట్ జిల్లా జేఏసీ చైర్మన్ బత్తుల శ్రీనివాస్ సెక్రటరీ సిర్ర మణికుమార్ వైస్ చైర్మన్ గౌతమ్ ప్రసాద్ జానుబాబు బి రమణ గంగాధర్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు పేట్టా శివప్రసాద్, కొండ, ప్రభుత్వ పాఠశాల నైట్ వాచ్మెన్ జిల్లా కార్యదర్శి రాంబాబు మార్కెట్ కమిటీ జిల్లా నాయకులు శ్రీరామ్, నిమ్మకాయల వెంకటేష్, టి గోపి, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు




## ఐదేళ్లుగా అసంపూర్తిగా జూనియర్ కాలేజీ టాయిలెట్ నిర్మాణం.

### -పనులు మధ్యలోనే నిలిపివేత.. విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు.-వెంటనే పూర్తి చేయాలని విద్యార్థుల విజ్ఞప్తి.



**అనంతగిరి: జూలై 30 (తెలుగు రాష్ట్రం విలేఖరి)**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఐదేళ్ల క్రితం ప్రారంభించిన టాయిలెట్ నిర్మాణ పనులు నేటికీ అసంపూర్తిగానే ఉండిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులను ప్రారంభించినప్పటికీ, అవి మధ్యలోనే నిలిచిపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది.స్థానికుల కథనం ప్రకారం, నిర్మాణ పనులు కొంతవరకు పూర్తయ్యాక సకాలంలో బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారని తెలుస్తోంది. అప్పటి నుంచి నిర్మాణం అలాగే ఉండిపోవడంతో టాయిలెట్ భవనం చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగి అడవిని తలపించేలా మారాయి. దీంతో ఆ ప్రాంతానికి వెళ్లాలంటేనే విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం కళాశాలలో చదువుతున్న విద్యార్థులు సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా విద్యార్థినులు మరింత అసౌకర్యానికి గురవుతున్నారని చెబుతున్నారు. విద్యా సంస్థల్లో పారిశుద్ధ్య సౌకర్యాలు తప్పనిసరి అయినప్పటికీ, ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న ఈ నిర్మాణాన్ని పూర్తి చేయడంలో సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.వర్షాకాలంలో పిచ్చి మొక్కల మధ్య పాములు, విషపురుగులు సంచరించే అవకాశం ఉండటంతో విద్యార్థుల భద్రతపై కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. అసంపూర్తి నిర్మాణం కారణంగా ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని, వెంటనే నిర్మాణ పనులను పునఃప్రారంభించి పూర్తి చేసి విద్యార్థుల వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు అధికారులను కోరుతున్నారు.విద్యార్థుల సమస్యను జిల్లా విద్యాశాఖ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు అత్యవసరంగా పరిశీలించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేసి నిర్మాణాన్ని పూర్తి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల ప్రాథమిక అవసరమైన పారిశుద్ధ్య సౌకర్యాల విషయంలో ఇకనైనా అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.



## బహుముఖ ప్రజ్ఞాశాలి - సీమ చిన్నోడు పులికంటి

### -ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి



**కడప కల్చరల్ జూలై 30: (తెలు గు రాష్ట్రం)**

"రాయలసీమ చిన్నో న్ని రాళ్ల మద్దె బతికే వాన్ని" అం టూ చిత్తూరు నుండి శ్రీకాకుళం వరకు వేల సభా వేదికల్లో గొంతె త్తి పాడి అందరి మన్ననలు అందుకున్న ప్రజ్ఞాశాలి పులికంటి కృష్ణారెడ్డి అని వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్య క్షులు ఆచార్య మూల మల్లికా ర్జున రెడ్డి అన్నారు. గురువారం రెడ్డి సేవా సమితి సమావేశ మందిరంలో పులి కంటి కృష్ణా రెడ్డి 96వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మల్లికా ర్జున రెడ్డి మాట్లాడుతూ నటుడి గా, రచయితగా,కవిగా, నాటక కర్తగా,బుర్రకథ గాయకుడిగా పులి కంటి కృష్ణారెడ్డి బహు ముఖ ప్రజ్ఞను ప్రదర్శించారని ఆయన రచనలపై పరిశోధనలు చేసి నలుగురు పీహెచ్డీ డిగ్రీ, ము గ్గురు ఎంఫీల్ డిగ్రీ పొందారని, 2005లో శ్రీ వేంకటేశ్వర విశ్వవి ద్యాలయం ఆయనను గౌరవ డాక్టరేట్ తో సత్కరించిందని, సాహిత్య, కళా రంగాలకు చేసిన సేవలకు ఎన్నో సత్కారాలు సన్మానాలు పొందిన కృష్ణారెడ్డి 'పులి కంటి సాహితీ సత్కృతి' సంస్థను స్థాపించి సాహిత్య కళా రంగాలకు కృషిచేసిన ఎంతో మందిని సత్కరించిన మహా నుభావుడని అన్నారు. 'మధుర కవి 'డాక్టర్ వెల్లాల వెంకటేశ్వ రాచారి ప్రసంగిస్తూ పులి కంటి వారు 200 పైగా కథలు, ఐదు దృశ్య నాటికలు,ఆరు శ్రవ్య నాటికలు,10 బుర్రకథలు, 60 లలిత గేయాలు రచించార న్నారు. కడప రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండా రెడ్డి మాట్లాడుతూ కృష్ణారెడ్డి రాయలసీమ వెతల నేపథ్యం తో సీమ యాసతో జీవం ఉట్టిపడే పదాలతో అద్భుతమైన కథలు రాశారని, ఈయన రాసిన కథలు ఇంగ్లీషు, హిందీ, కన్నడ, మల యాళ,తమిళ భాషల్లో ప్రచురితమయ్యాయన్నారు.విశ్రాంతం తెలుగు ఉపాధ్యాయులు కొండా చెంచి రెడ్డి ప్రసంగిస్తూ ఆయన రాసిన గూడు కోసం గువ్వలు, పులికంటి కథలు,పులి కంటి దళిత కథలు, పులి కంటి కథా వాహిని పేర్లతో పలు సంపు టాలుగా వెలుగులోకి వచ్చాయ న్నారు.కార్యక్రమంలో కడప రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి, కోశాధికారి గుడ్ల ఆదినారాయణ రెడ్డి, మద్దిక సుబ్బిరెడ్డి, పద్మ ప్రియ చంద్రా రెడ్డి, ఎస్సార్ శివ నారాయణ రెడ్డి,జి వెంకటరెడ్డి, పి రామ సుబ్బారెడ్డి, సేవా సమితి హాస్టల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

## రత్నకుమారి కి వైవియూ డాక్టరేట్

**కడప వైవీయూ జూలై 30: (తె లుగు రాష్ట్రం)**



యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పరిశోధక విద్యార?థిని గంటిపోగు రత్నకుమారి కి వై.వి.యూ డాక్ట రేట్ ని ప్రదానం చేసింది. తెలుగు శాఖ ఆచార్యులు జి.పార్వతి పర్యవేక్షణలో " ఒక దశాబ్ది రా యలసీమ నవల లు-ఒక పరి శీలన" అనే అంశంపై చేసిన పరి శోధనలకు గాను ఈ డాక్టరేట్ ని ప్రదానం చేసినట్లు విశ్వవిద్యా లయ పరీక్షల నియంత్రణా అధికారి ఆచార్య కె.యస్.వి. కృష్ణారావు ప్రకటించారు. నం ద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్కూర్ చెందిన రత్నకుమారి తల్లిదం డ్రులు నాగభూషణం బేబీ. కూలి పనులు చేసుకుని రత్నకు మా రిని చదివించారు. ఈమె యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యు జి సి) నెట్ అర్హత సాధించి ఫెలోషిప్ అందుకుని పీహెచ్డీ ప్రవేశం పొందారు. ఏపీ సెట్ కూడా అర్హత సాధించారు. వారి గ్రామం నుంచి తొలి డాక్టరేట్ ఈమె. రత్నకుమారి రాసిన పరిశోధనా వ్యాసాలు పలు జాతీయ అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురితం అయ్యా యి. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్, తెలుగు విభాగ ఆచార్యులు పార్వతి, ఎన్ ఈశ్వర్ రెడ్డి, విభా గాధిపతి ఎం ఎం వినోదిని, పి. రమాదేవి, టి. రాంప్రసాద్ రెడ్డి, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు ఆచార్య పి సరిత, స్కాలర్లు విద్యార్థులు ప్రశంసిం చారు.

## దొంగలు బాబోయ్ దొంగలు.



**కమలాపురం జూలై 30తెలుగు రాష్ట్రం ప్రతినిధి.**

కమలాపుర మండలం ఎర్రగుడిపాడులోని అంకాలమ్మ ఆలయంలో దొంగలు దొంగలు పడ్డారు.బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు సుమారు 70 తులాలు ఎండి ఆభరణాలు దొంగలించినట్లు స్థానికులు తెలిపారు.ఇటీవల కమలాపురం నగర పంచాయతీలో సబ్ జైల్ పెట్రోల్ బంక్ సమీపంలో కూడా వరుస మూడుసార్లు దొంగతనాలకు ప్రయత్నించడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారురాత్రి సమయాలలో ఎప్పుడు ఎక్కడ దొంగతనాలు జరుగుతాయి అని బిక్కుబిక్కుమంటూ నిద్రిస్తున్న ప్రజలు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు గట్టి చర్యలు తీసుకొని నిఘా పెంచి దొంగలను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు

## కనోస్సా స్కూల్లో ఘనంగా ఇన్వెస్టిస్టిచర్ సెరిమనీ వేడుకలు,,






**పాయకరావుపేట, 30 : తెలుగు రాష్ట్రం ప్రతినిధి,,**

పట్టణంలోని కనోస్సా స్కూల్లో గురువారం ఇన్వెస్టిచర్ సెరమనీ వేటకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థుల లీడర్స్ ఎన్నికల్లో ఎంపికైన స్కూల్ లీడర్స్, అసిస్టెంట్ స్కూల్ లీడర్స్, హౌస్ కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్, ఎకో క్లబ్ టీముగా నిలిచిన విద్యార్థులకు బ్యాడ్జిలు బహుకరించి లీడర్స్ యొక్క విధులు, బాధ్యతలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మేనేజిర్ సిస్టర్ థాంకిమ్ జాన్, ప్రిన్సిపిల్ సిస్టర్ సంతాన థామస్, వైస్ ప్రిన్సిపిల్ సిస్టర్ వీని, పిఇటి శ్రీను, సిస్టర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# మానవ అక్రమ రవాణా, మహిళల భద్రతపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి..AHTU సీఐ శ్రీ జి. ఈదురు బాషా

### -యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు



**కడప జూలై 30 తెలుగు రాష్ట్రం ప్రతినిధి.**

వై.ఎస్.ఆర్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు జిల్లా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ాూఌఖ) ఆధ్వర్యంలో గురువారం కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జులై 30 న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా విద్యార్థినుల కోసం మానవ అక్రమ రవాణా, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మహిళల రక్షణకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, శక్తి యాప్, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సుమారు 250 మందికి పైగా విద్యార్థినులు హాజరై పోలీసు అధికారులు అందించిన సూచనలు, అవగాహన సందేశాలను ఆసక్తిగా విన్నారు. ఈ సందర్భంగా ాూఌఖ సీఐ శ్రీ జి. ఈదురు బాషా మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా సమాజానికి తీవ్రమైన ముప్పని, ఉద్యోగాలు, ఉన్నత విద్య, వివాహాలు లేదా ఇతర అవకాశాల పేరుతో వచ్చే తప్పుడు ప్రలోభాలకు యువతులు మోసపోవద్దని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మహిళలు తమ భద్రత కోసం శక్తి యాప్‌ను వినియోగించుకోవడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో 112 ఎమర్జెన్సీ సేవలు, 1930 సైబర్ హెల్ప్‌లైన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ శ్రీ ఎ. అబ్రహం మాట్లాడుతూ, సోషల్ మీడియా, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థినులకు వివరించారు. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రొటెక్షన్ అధికారి శ్రీమతి జి. సునీత మహిళల హక్కులు, ప్రభుత్వ రక్షణ వ్యవస్థలు, సంక్షేమ సేవలపై అవగాహన కల్పించగా, నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ కె. రెడ్డప్ప విద్యార్థినులు విద్యతో పాటు వ్యక్తిగత భద్రతకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ాూఌఖ సిబ్బంది ఎస్.ఏ. అలీ, శక్తి కంట్రోల్ రూమ్ ఏ. నాగజ్యోతి, మహిళా పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుళ్లు సి. హెచ్. జేబ్, కె. నాగేష్ కుమార్, శక్తి టీమ్ సభ్యులు డబ్ల్యూపీసీ కె.వి. శైలజ, డబ్ల్యూపీసీ సి. ఇందిరా ప్రియదర్శిని, హెచ్‌సీ సి.వి. శివశంకర్ రెడ్డి, పీసీ బి. రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు శాఖ ప్రజల్లో భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తుందని పోలీస్ అధికారులు తెలిపారు.




# యువత లక్ష్యసాధనతో పాటు సామాజిక బాధ్యతను కూడా అలవరుచుకోవాలి

### -జిల్లా ఎస్పీ-జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐ.పి.ఎస్ గారు..




**పులివెందుల జూలై 30 తెలుగు రాష్ట్రం ప్రతినిధి.**

పులివెందుల జె.ఎన్.టి.యు ఇంజనీరింగ్ విద్యార్థులతో జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐ.పి.ఎస్ ముఖాముఖి కార్యక్రమం ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు పులివెందుల జె.ఎన్.టి.యు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో ఆత్మీయంగా సంభాషించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ నేరాల నివారణ, డిజిటల్ భద్రత, మహిళలు మరియు చిన్నారుల రక్షణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. భవిష్యత్తులో పోలీసింగ్ ఎలా ఉండాలని కోరుకుంటున్నారు, ఎలాంటి మార్పులు ఆశిస్తున్నారు అనే అంశాలపై, పోలీస్ శాఖతో వారికి ఎదురైన అనుభవాలను ఈ సందర్బంగా జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐ.పి.ఎస్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రంగంలో కూడా విద్యార్థుల పాత్ర కీలకమని, సమాజంలో విద్యార్థుల పాత్ర ముఖ్యమైనదన్నారు. పోలీస్ శాఖ తో వారి జీవితంలో ఎదురైన అనుభవాలను జిల్లా ఎస్పీ తో పంచుకున్నారు. నేటి ఆధునిక యుగంలో భద్రతా పరంగా పొంచి ఉన్న ప్రమాదాలను విద్యార్థులకు వివరించడం జరిగిందన్నారు. విద్యార్థులు తమ విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ విద్యార్థులకు సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సానుకూల దిశగా వినియోగిస్తూ సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు లేదా బ్యాంకు వివరాలను ఎవరికీ పంచుకోవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్--112ను సంప్రదించాలని, మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న శక్తి యాప్ ను వినియోగించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా ఎస్పీ సమాధానాలు ఇచ్చి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి దేశానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పులివెందుల డి.ఎస్.పీ శ్రీ బి.మురళి, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పీ శ్రీ ఎన్.సుధాకర్ పులివెందుల అర్బన్ సి.ఐ శ్రీరామ్, జె.ఎన్.టి.యు ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డి.విష్ణువర్ధన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శేష మహేశ్వరమ్మ, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు



# కనీశ వేతనం 26 వేలు కోరుతూ ఉద్యోగులు, కార్మికుల ఆందోళన

### -కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చేసి, రెగ్యులర్ చేయాలని డిమాండ్-స్కూల్ ఆయాలు, పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని నినాదాలు



**కాకినాడ, కలెక్టరేట్ జూలై 30 న్యూస్ (తెలుగు రాష్ట్రం విలేఖరి)**

ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీస వేతనం 26 వేలు చెల్లించాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేసి, రెగ్యులర్ చేయాలని నెలల తరబడి బకాయి పెట్టిన స్కూలు ఆయాల, పంచాయతీ కార్మికుల వేతనాలను తక్షణం చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, రాజా సర్కిల్ వరకు ర్యాలీ చేసి జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్ గారికి వినతి పత్రం అందించారు. 10 రోజుల్లో సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులతో యూనియన్ నాయకత్వానికి జాయింట్ సమావేశం నిర్వహించి సమస్యలుపరిష్కరించేందుకు కృషి చేస్తానని జేసీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు అఖిలభారతఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 71 రకాల షెడ్యూల్ పరిశ్రమల్లో వేతనాలను సవరించి 15 ఏళ్లు గడుస్తుందని, 2026 లో కూడా 2011లో నిర్ణయించిన వేతనాలనే నేటికి చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్య కాలంలో నిత్యవసర సరుకుల ధరలు ప్రభుత్వ లెక్కల ప్రకారమే 300% పెరిగాయని, ఈ 15 ఏళ్లలో రాష్ట్రాన్ని పాలించిన ఏ రాజకీయ పార్టీ కూడా కనీస వేతనాలను సవరించకుండా, పెట్టుబడిదారుల లాభాల కోసమే పనిచేసాయని విమర్శించారు. పంజాబు, ఒరిస్సా, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాలలో కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను లక్షల మందిని రెగ్యులర్ చేస్తుంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎందుకు చేయరని ప్రశ్నించారు. తెలంగాణలో కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచి, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అన్ని ప్రభుత్వ డిపార్ట్మెంట్లలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల 8 గంటల పనిని 10:30 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని కార్మికులు ఉద్యోగులు గుర్తుపెట్టుకోవాలన్నారు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్ల ఫలితంగా పరిశ్రమల్లో అధికారుల తనిఖీలను నిలిపివేయడంతో యజమానులు లాభాల కోసం కార్మికుల భద్రత గాలికి వదిలేసారని దాని పర్యవసానమే పరిశ్రమల్లో ప్రమాదాలు పెరగడానికి కారణం అన్నారు. రాష్ట్రంలో కనీస వేతన సలహా మండలి రాజకీయ నిరుద్యోగులకు ఆశ్రయంగా మారిందని ఎద్దేవా చేశారు. జిల్లాలో వేగంగా విస్తరిస్తున్న ఆక్వా పరిశ్రమల్లో కార్మిక చట్టాల అమలు మాటలేదని, కనీస చట్టాలైన పిఎఫ్, ఈఎస్ఐ కూడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికార యంత్రాంగం కలగజేసుకుని కార్మికులకు కనీస చట్టాలు అమలు జరిగేలా చర్యలు చేపట్టకపోతే మరిన్ని పోరాటాలకు సిఐటియు కార్మికులను సిద్ధంచేస్తామని హెచ్చరించారు. జిల్లాలో సెకండ్ ఏఎంఎం లుగా మిగిలిపోయిన 52 మందిని తక్షణం సచివాలయ ఏఎంఎం లుగా నియమించాలని కోరారు. కాకినాడ జిజిహెచ్ లో పనిచేసే శానిటేషన్, మెస్, సెక్యూరిటీ, ఆర్.ఎం.సి గార్డుల సమస్యలను ఎప్పటికప్పుడుపరిష్కరించేలా, కాంట్రాక్టర్లు కార్మికచట్టలను గౌరవించి అమలుజరిగేలా జిల్లా కలెక్టర్ బాధ్యత తీసుకోవాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ బాధ్యత వహించే శాఖలో పంచాయతీ కార్మికులకు ఎప్పటికీ 6వేలు మాత్రమే వేతనాలు చెల్లించడం, అదికూడా నెలల తరబడి బకాయిలు పెట్టడం సిగ్గుచేటు అన్నారు. చివర్లో సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ వందన సమర్పణచేసి కార్యక్రమాన్ని ముగించారుఈకార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్స్ ఉద్యోగుల సంఘం నాయకులుసత్యనారాయణ, మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ నగర కార్యదర్శి వర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చివుకుల వెంకటరావు, రాష్ట్ర కోశాధికారి దుంపుల ప్రసాద్, జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయకుమార్, వాసు, లక్ష్మిప్రియ, మెస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏడుకొండలు, సెక్యూరిటీ గార్డ్ సంఘం నాయకులు ధర్మా, భాగ్యలక్ష్మి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు సతీష్, స్కూల్ ఆయాల సంఘం నాయకురాలు సుజాత, రెండవ ఏఎన్ఎం సంఘం నాయకులు లోవమణి, పద్మజ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అప్పారావు, స్కూల్ నైట్ వాచ్మెన్ సంఘం నాయకులు వీర్రాజు, పోర్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుకు కాశీ, సూర్యారావు,సూర్యనారాయణ, క్లాప్ డ్రైవర్ల సంఘం నాయకులు సంతోష్, కుమార్, ఈ కార్యక్రమానికి ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రావతి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సత్తిరాజు మద్దతు తెలియజేశారు. సిఐటియు వర్కింగ్ కమిటీ సభ్యులు షేక్ పద్మ, నక్కెళ్ళ శ్రీను, కామేశ్వరి, టి.రాజా, మేడిశెట్టి వెంకటరమణ, పలివెల వీరబాబు, ఎల్ఐసి సత్యనారాయణ, కాళ్ళ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



# ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రజలకు నాణ్యమైన బియ్యం సరఫరా జెసి నిధి మీనా

కడప జూలై 30 తెలుగు రాష్ట్రం ప్రతినిది



కడప జిల్లా లోని రైతు బజార్లు, రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఆగస్టు 1వ తేదీ నుంచి నాణ్యమైన బియ్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డా నిధీ మీనా, పౌర సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్లో జాయింట్ కలెక్టర్ డా నిధీ మీనా, పౌర సరఫరాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై ఆగస్టు 1వ తేదీ నుంచి జిల్లాలో ప్రజలకు బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ.52/- లకు, గ్రేడ్ 1 పచ్చి బియ్యం (రా రైస్) రూ. 50/- లకు నాణ్యమైన బియ్యాన్ని అందించే లక్ష్యంతో చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, రాష్ట్ర వ్యాప్తంగా ఆగష్టు 1 నుంచి ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందించే కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో జిల్లాలో పౌర సరఫరాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు సమన్వయం తో పనిచేసి రైతు బజార్ల వద్ద మరియు రైస్ మిల్లర్స్ అవుట్ లెట్స్ వద్ద నాణ్యమైన బియ్యం అమ్మకాల కౌంటర్ల ఏర్పాటుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పౌర సరఫరా శాఖ అధికారులు ప్రతి రోజూ సంబంధిత కౌంటర్ల ను విజిట్ చేయడంతో పాటు స్టాక్ వివరాలను, ఓపెనింగ్, క్లోజింగ్ స్టాక్ వివరాలు నమోదు చెయ్యాలన్నారు. మంచి నాణ్యత గల బియ్యాన్ని అందుబాటు ధరలకు ప్రజలకు సరఫరా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. గుర్తించబడిన రైస్ మిల్లు అవుట్‌లెట్ల ద్వారా ఆమోదించబడిన బియ్యం రకాలను మాత్రమే సరఫరా చేయాలని, అధిక ధరలు వసూలు చేయడం లేదా అనధికారికంగా అదనపు రుసుములను వసూలు చేయడం అనుమతించబడదని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలను పాటించడంతో పాటు ఏర్పాటు చేసిన అన్ని అవుట్‌లెట్లలో తగినంత నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి అవుట్‌లెట్‌లో ధరల బోర్డులు, అందుబాటులో ఉన్న రకాలు, పనివేళలు మరియు కార్యక్రమ వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యత ఇస్తూ నాణ్యమైన బియ్యం నిరంతరాయంగా లభించేలా చర్యలు చేపట్టాలన్నారు. నాణ్యమైన బియ్యం అమ్మకాల విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర రావు, డిఎం సివిల్ సప్లయ్ శ్రీమతి నాగ సుధ, మార్కెటింగ్ శాఖ ఏడి శ్రీ నరేంద్ర, పౌర సరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వేంపల్లి,చక్రాయపేట పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ

కడప జూలై 30 తెలుగు రాష్ట్రం ప్రతినిధి.



వేంపల్లి, చక్రాయపేట పోలీస్ స్టేషన్ల ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ పులివెందుల పోలీస్ సబ్ డివిజన్ లోని వేంపల్లి, చక్రాయపేట పోలీస్ స్టేషన్ల ను జిల్లా ఎస్.పి శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్ లో రికార్డులు పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పాత నేరస్థులు, సస్పెక్ట్ ల కార్యకలాపాలపై నిఘా ఉంచాలని సంబంధిత స్టేషన్ అధికారులకు సూచించారు.పోలీస్ స్టేషన్ లలోని సిబ్బందితో మాట్లాడి వారికి కేటాయించిన విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. మరింత సమర్ధవంతంగా విధులు నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. వృత్తిపరమైన సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ల (వూఉ) ల విధుల గురించి ఆరాతీసి వారికి పలు సూచనలు చేశారు. చీం 440 జాతీయ రహదారి నిర్మాణంలో ఉన్నందున వాహనదారులకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వేంపల్లి సి.ఐ నరసింహులును జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశించారు.విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా గ్రామాలకు వెళ్లి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. గ్రామాల్లో నైట్ హాల్ట్ చేయాలని ఆదేశించారు.అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ తదితర నేరాలు జరగకుండా గట్టిగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు త్వరితగతిన విచారించి పరిష్కరించాలని ఆదేశించారు.సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా డే బీట్ లు, నైట్ బీట్ లు పెంచాలని ఆదేశించారు. అనుమానాస్పదంగా తిరిగే వారిని విచారించాలన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదు దారుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా ఎస్.పి వెంట స్పెషల్ బ్రాంచ్ డీ.ఎస్.పి శ్రీ ఎన్.సుధాకర్ పులివెందుల డి.ఎస్.పి శ్రీ బి.మురళి, వేంపల్లి సి.ఐ నరసింహులు, ఆర్కే వ్యాలీ సి.ఐ శంకర్ రెడ్డి, చక్రాయపేట ఎస్.ఐ చంద్రశేఖర్ ఉన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో యువత భవిష్యత్తు అంధకారం

## - యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగమధు యాదవ్

కడప జూలై 30 తెలుగు రాష్ట్రం ప్రతినిధి



కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ తీరుతో యువత, విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారుతోందని యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగమధు యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నంది మండలం వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ, రాహుల్ గాంధీ, వైయస్ రాజశేఖర్ రెడ్డి ల విగ్రహాలకు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గురువారం కాంగ్రెస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా కష్టపడి చదివిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దీంతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తే ఆయన పట్ల బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు పోలీసుల ముసుగులో దౌర్జన్యపూరితంగా వ్యవహరించడం దారుణమన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి ఇస్తామని హామి ఇచ్చి నేటికీ ఆ హామిని అమలు చేయలేదన్నారు. డీఎస్సీలో అవకతవకలు జరిగితే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎక్కడా అవకతవకలు జరగలేదని చర్చకు రావాలంటూ సవాల్ విసరడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలోని బీసీ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, హాస్టళ్లలోకి విద్యార్థి సంఘాల ప్రవేశం నిషిద్ధమంటూ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు మైనుద్దీన్, నాయకులు, పాలగిరిశివ జనరల్ సెక్రెటరీ,అబ్దుల్ రౌఫ్, కరీం, మామిళ్ళ బాబు,అవినాష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన లబ్ధిదారులకు త్వరలోనే పింఛన్లు మంజూరు చేస్తాం..

## -ఎమ్మెల్యే అమిలినేని -వాల్మీకి విగ్రహానికి పైన స్లాబ్ వేసేందుకు 1,00,000 అందజేత



కుందుర్పి జులై 30 తెలుగు రాష్ట్రం విలేకరి

వైసీపీ ప్రభుత్వంలో రకరకాల కారణాలు చెప్పి ఎంతో మంది నిరుపేద వృద్దులు, వికలాంగులు, వితంతువుల పింఛన్లు తొలగించి వారి పొట్ట కొట్టారని కూటమి ప్రభుత్వంలో త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందించి వారికి అండగా నిలుస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు కుందుర్పి మండలం వడ్డేపాల్యం గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు, మండల గ్రామ స్థాయి నాయకులతో కలసి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు..ముందుగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే కి గ్రామస్థులు, నాయకులు పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలుకగా ఆంజనేయ స్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం గ్రామంలోని మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య పాలన, కనీసం గ్రామాల్లో సరైన మౌళిక వసతుల కల్పనపై కూడా ద్రుష్టి పెట్టకుండా సమస్యలను పెంచి వెళ్లారని ఇప్పుడు వాటిని అదిగమించి గ్రామీణ రహదారులతో పాటు గ్రామాల్లో మౌళిక వసతులైన విద్యుత్, తాగునీరు, సీసీ రహదారులు నిర్మించి ప్రజల సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు.గ్రామంలో వాల్మీకి విగ్రహానికి పైకప్పు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరగా వెంటనే తన స్వంత నిధులతో పూర్తి చేస్తామని అందుకు పనులు ప్రారంభించేందుకు గాను 1,00,000 రూపాయలు గ్రామస్థులు అందించారు..గ్రామంలో నాగమ్మ అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి వెంటనే వైద్యులతో మాట్లాడి మరింత మెరుగైన వైద్యం అందేలా చూస్తామని ఖర్చుల కోసం 10,000 రూపాయలు అందించారు..గ్రామానికి చెందిన మారెక్క, యశోదమ్మలకు వైసీపీ ప్రభుత్వంలో పింఛన్ తొలగించారని తెలుసుకుని త్వరలో తప్పకుండా పింఛన్ మంజూరు చేస్తామని వారికీ ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి 5,000 రూపాయల చొప్పున అందజేశారు..ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కాంపౌండ్ నందు సీసీ, టాయిలెట్లు అవసరం ఉందని అడగ్గా తప్పకుండా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు..



# విద్యార్థులకు సేవ చేసే భాగ్యం కలగడం నా అదృష్టం

## -మూడవ రోజు గ్రామీణ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



కుందుర్పి జులై 30 తెలుగు రాష్ట్రం విలేఖరి

కుందుర్పి మండలం వడ్డీ పాలెం, మలయనూరు, నిజవల్లి. గ్రామాలలోలివిద్యార్థుల భవిష్యత్తుకు తోడుగా ఉండి విద్యకు ప్రాధాన్యత కల్పించి వారికి మరింత ప్రోత్సాహం అందించడం కోసం సరైన రవాణా సౌకర్యం లేక పాఠశాలలకు నడుచుకుంటూ వెళ్తున్న గ్రామీణ ప్రాంతాల 9,10 తరగతి, ఇంటర్ విద్యార్థులకు కానుకగా సైకిళ్లు అందిస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు.లి మూడవ రోజు గ్రామీణ విద్యార్థులకు ప్రోత్సాహక కానుకగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అందిస్తున్న సైకిళ్ల పంపిణీ కుందుర్పి మండలం మాలయనూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించగా టీడీపీ మండల, స్థానిక నాయకులు ఎమ్ ఈ ఓలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందంతో కలసి పాల్గొని సైకిళ్లు విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అందరికి అమ్మవడి అని చెప్పి తీరా అందించే సమయానికి ఒక్క ఇంట్లో ఒక్కరికే ఇచ్చి వారి చదువులను తుంగలో తొక్కాడన్నారు.అంతే కాకుండా కేవలం అమ్మవడి పథకం ద్వారా కేవలం 5500 కోట్లు అందించారని,కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు తల్లిదండ్రుల బాధలు తెలుసుకుని అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంట్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు ఎంతమంది ఉంటే అందరికి తల్లికివందనం అందిస్తామని హామీ ఇచ్చి నేడు 10,190 కోట్లు కేటాయించి ప్రతి తల్లి ఖాతాకు జమ చేసి నిబద్దత చాటుకున్నారని అందులో కూడా చాలీ చాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్న 30,000 మంది అంగన్వాడీ ఉపాధ్యాయులకు అందించి కూటమి ప్రభుత్వం గొప్ప మనసు చాటుకుందని తెలిపారు..అంతే కాకుండా గతంలో విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేసి ఉపాధ్యాయులను బ్రాంది షాపుల వద్ద ఉంచారని అన్నారు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న నారా లోకేష్ దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చారన, వైసీపీ ప్రభుత్వంలో ప్రతి పథకానికి జగన్ పేరు పెట్టుకుని నాశిరకమైనవి అందజేశారని నేడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ ద్వారా నాణ్యమైన బట్టలు, పుస్తకాలు, బ్యాగులు, షఉష్, ఇలా కార్పొరేట్ స్థాయిలో అందించగా, ఏ విద్యార్థి కూడా కడుపు మాడ్చుకోకుండా కడుపునిండా భోజనం చేసేలా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పేరుతో సన్న బియ్యంతో ప్రతి రోజు ఒక్కో మెనూతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారని అన్నారు..ఎన్నికల ముందు గ్రామాలకు వెళ్లిన సందర్భంలో చాలా చోట్ల విద్యార్థులు పుస్తకాల బ్యాగులు మోసుకుని నడుచుకుంటూ రావడం చుసి బాధ కలిగి అనాడే అనుకున్నా విద్యార్థులకు ఏదో ఒక రాకంగా వారి ఇబ్బందులు తొలగించాలని నిర్ణయించుకున్నానని నేడు వారికి సైకిళ్లు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు..ప్రతి విద్యార్థి భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని, వారికి అనవసరపు పనులకు కేటాయించకుండా చదువుకునేందుకు ఎక్కువ సమయం కేటాయించి వారి బంగారు భవిష్యత్తుకు బాసటగా నిలవాలన్నారు.



# ఆశ వర్కర్ల సమస్యలపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి వినతి..

## -ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)...



రంపచోడవరం,జులై 30(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):

పోలవరం జిల్లా రంపచోడవరం పర్యటనకీ విచ్చేసిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వర్యులు సత్య కుమార్ యాదవ్ కి గంగవరం పర్యటనలో ఆశవర్కర్ల సమస్యలు పరిష్కారం చెయ్యాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఈ రోజు గంగవరంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఇవ్వటం జరిగింది.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా ఆశావర్కర్లకు కనీస వేతనం రూ 26,000/- వేలు చెల్లించాలని, ఏజెన్సీ ప్రాంతంలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేసి ఆశాలతో పాటు సమాన వేతనం ఇవ్వాలని,అన్నీ రకాల సెలవులు ఇవ్వాలని,ఆశావర్కర్లు మరణిస్తే దహన సంస్కరాలకు మట్టి ఖర్చులు ఇవ్వాలని,ఆశావర్కర్ల నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని,కాళీ పోస్టులు వెంటనే భర్తీ చెయ్యాలని, మరియు ఇతర సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి గంగవరం పర్యటనలో ఇవ్వటం జరిగిందని ఆమె తెలిపారు.వైద్య ఆరోగ్యశాఖలో క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న ఆశావర్కర్లు అనేక సమస్యలతో అరకొర వేతనాలతో సేవలు అందిస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ మాత్రమే కాదు రాష్ట్ర ప్రభుత్వం కూడా వారి యొక్క సమస్యలపై స్పందించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. పోలవరం జిల్లా (రంపచోడవరం) 12,మండలాలలో ఉన్నా ఆశా వర్కర్ల పట్ల అధికారులు చాలా నిర్లక్ష్యంతో ఉన్నారని,వారి సమస్యలు పరిష్కారం కోసం జాయింట్ మీటింగ్ వేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న ఇప్పటివరకు జాయింట్ మీటింగ్ వేసిన దాకలాలు లేవని.అధికారులు ఇంతటి నిర్లక్ష్యం వహిస్తే ఈ ప్రాంతంలో ఆశవర్కర్ల సమస్యలు ఎలా పరిష్కారం చేస్తారని ఆమె ప్రశ్నించారు.ఈ సమస్యల పరిస్కారానికై రేపు 31,న జిల్లా కలెక్టరెట్ వద్ద జరిగే ధర్నాలో ఆశావర్కర్లు అందరూ పాల్గొంటారని ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ఆమె తెలిపారు.



# ఆశ వర్కర్ల సమస్యలపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి వినతి..

## -ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)...



రంపచోడవరం,జులై 30(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):

పోలవరం జిల్లా రంపచోడవరం పర్యటనకీ విచ్చేసిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వర్యులు సత్య కుమార్ యాదవ్ కి గంగవరం పర్యటనలో ఆశవర్కర్ల సమస్యలు పరిష్కారం చెయ్యాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఈ రోజు గంగవరంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఇవ్వటం జరిగింది.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా ఆశావర్కర్లకు కనీస వేతనం రూ 26,000/- వేలు చెల్లించాలని, ఏజెన్సీ ప్రాంతంలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేసి ఆశాలతో పాటు సమాన వేతనం ఇవ్వాలని,అన్నీ రకాల సెలవులు ఇవ్వాలని,ఆశావర్కర్లు మరణిస్తే దహన సంస్కరాలకు మట్టి ఖర్చులు ఇవ్వాలని,ఆశావర్కర్ల నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని,కాళీ పోస్టులు వెంటనే భర్తీ చెయ్యాలని, మరియు ఇతర సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి గంగవరం పర్యటనలో ఇవ్వటం జరిగిందని ఆమె తెలిపారు.వైద్య ఆరోగ్యశాఖలో క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న ఆశావర్కర్లు అనేక సమస్యలతో అరకొర వేతనాలతో సేవలు అందిస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ మాత్రమే కాదు రాష్ట్ర ప్రభుత్వం కూడా వారి యొక్క సమస్యలపై స్పందించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. పోలవరం జిల్లా (రంపచోడవరం) 12,మండలాలలో ఉన్నా ఆశా వర్కర్ల పట్ల అధికారులు చాలా నిర్లక్ష్యంతో ఉన్నారని,వారి సమస్యలు పరిష్కారం కోసం జాయింట్ మీటింగ్ వేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న ఇప్పటివరకు జాయింట్ మీటింగ్ వేసిన దాకలాలు లేవని.అధికారులు ఇంతటి నిర్లక్ష్యం వహిస్తే ఈ ప్రాంతంలో ఆశవర్కర్ల సమస్యలు ఎలా పరిష్కారం చేస్తారని ఆమె ప్రశ్నించారు.ఈ సమస్యల పరిస్కారానికై రేపు 31,న జిల్లా కలెక్టరెట్ వద్ద జరిగే ధర్నాలో ఆశావర్కర్లు అందరూ పాల్గొంటారని ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ఆమె తెలిపారు.



# మెగా డీఎస్సీపై దుష్ప్రచారం రుజువు చేస్తే రాజీనామా

## -సున్నా స్థాయికి వైసీపీ పతనం-ఎమ్మెల్సీ పేరాబత్తుల



**కాకినాడ రూరల్, జూలై 30(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తుందని దానిని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం కాకినాడ రూరల్ సర్పవరంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల వ్యవహారంలో ఎలాంటి తప్పు జరగలేదని, ఒకవేళ లొసుగులు గానీ, అక్రమాలు గానీ జరిగినట్లు వైసీపీ నాయకులు నిరూపిస్తే తాను తక్షణమే తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని బహిరంగ సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును చూసి ఓర్వలేకే ప్రతిపక్ష వైసీపీ నిందలు వేస్తున్నాయని మండిపడ్డారు. హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ఇచ్చిన హామీల అమలుకు పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఒకవేళ పొరపాట్లు జరిగితే నైతిక బాధ్యత వహించడానికి ప్రభుత్వం ఎప్పుడూ వెనుకాడదని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి అంశాన్ని ప్రభుత్వం మర్చిపోలేదని, అయితే కేవలం భృతి ఇవ్వడం కంటే యువతకు విస్తృత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించి, పరిశ్రమల స్థాపన ద్వారా యువత భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేరాబత్తుల చెప్పారు. నిరుద్యోగ భృతితో పాటు వివిధ హామీలపై సీఎం నారా చంద్రబాబు త్వరలోనే స్పష్టత ఇస్తారని వెల్లడించారు. సంక్షేమ పథకాలను మరింత విస్తరిస్తున్నామని, కొత్తగా అర్హత సాధించిన లబ్ధిదారులకు వచ్చే నెల నుండి గృహ సంబంధిత ప్రయోజనాలను అందించేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే వైసీపీ ప్రజా విశ్వాసం కోల్పోయిందని డీఎస్సీ అంశం నుంచి సున్నా స్థాయికి గ్రాఫ్ పడిపోయిందని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తామని రాజశేఖర్ తెలిపారు.

# తక్కువ ధరకు సన్న బియ్యం

## - ఆగస్టు 1 నుంచి జిల్లాలో అమలు జేసీ అపూర్వ భరత్



**కాకినాడ, జూలై 30(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించి పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని అందుబాటు ధరలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ (ఎంఐపీ)ను ఆగస్టు 1 నుంచి కాకినాడ జిల్లాలో అమలు చేయనున్నట్లు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఐపీ కింద ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయిస్తామని తెలిపారు. సూపర్ ఫైన్ రైస్, స్టీమ్ (బీపీటీ) రైస్ కిలో రూ.52, రా (బీపీటీ) రైస్ కిలో రూ.50కు అందుబాటులో ఉంటాయని చెప్పారు. పంపిణీలో పారదర్శకత, సరుకు నాణ్యత, సరైన తూకాలు, నిర్ణీత ధరల అమలుపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని వెల్లడించారు. బియ్యం సేకరణ, రవాణా, పంపిణీ ప్రక్రియలను పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, రైస్ మిల్లర్లతో సమన్వయం చేస్తూ ఎలాంటి ఆటంకం లేకుండా నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని రైతు బజార్లు, ప్రత్యేక విక్రయ కేంద్రాలకు అవసరమైన సన్న బియ్యాన్ని నిరంతరం సరఫరా చేయాలని రైస్ మిల్లర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అధిక ధరలకు విక్రయించడం, నిల్వలను దుర్వినియోగం చేయడం, తూకాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రోజు విక్రయ కేంద్రాల వద్ద స్టాక్, అమ్మకాలు, వినియోగదారుల వివరాలను జిల్లా యంత్రాంగం పర్యవేక్షిస్తుందని, ప్రజలు ప్రభుత్వం గుర్తించిన అధికారిక విక్రయ కేంద్రాల నుంచే నిర్ణీత ధరలకు బియ్యం కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ కోరారు. సమావేశంలో డీఎస్వో (ఎఫ్ఏసీ) టి ప్రసన్న లక్ష్మీదేవి పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి నివాసంలో టీడీపీ నేతల ఆత్మీయ విందు

## -పార్టీ బలోపేతం, అభివృద్ధి కార్యక్రమాలపై కీలక చర్చలు



**కాకినాడ జులై 30 న్యూస్ (తెలుగు రాష్ట్రం విలేఖరి)**

హాజరైన జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు కాకినాడ రూరల్ పరిధిలోని వలసపాకలలో ఉన్న మాజీ శాసనసభ్యులు పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణ మూర్తి నివాసంలో జిల్లా పార్టీ నేతల ఆత్మీయ విందు కార్యక్రమం జరిగింది. టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌ల సమన్వయంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమ్మేళనం కేవలం విందుకే పరిమితం కాకుండా పార్టీ భవిష్యత్ కార్యాచరణకు వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా నాయకులంతా ఒకచోట చేరి జిల్లాలో పార్టీ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా గత రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లడం, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులు తదితర కీలక అంశాలపై నేతలుతమఅభిప్రాయాలను పంచుకున్నారు. నాయకుల మధ్య సమన్వయం పెంచేందుకు రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఇటువంటి ఆత్మీయ సమావేశాలు మరిన్ని నిర్వహిస్తామని పార్టీ జిల్లా అధ్యక్షులు నవీన్ సహా ఇతర నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ ఆత్మీయ విందు కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరపుల సత్యప్రభ, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, కాకినాడ రూరల్ ఇన్‌ఛార్జ్ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో తొలిసారి పోలవరం జిల్లాలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య 2.0 కు శ్రీకారం..

## -43.30 లక్షల మంది చిన్నారులకు కశీటి పరీక్షలు.-వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్...





**రంపచోడవరం,జూలై 30(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

పోలవరం జిల్లా రంపచోడవరంలోని ముసురుమిల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి ఆరోగ్య పరీక్షల ప్రారంభ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గురువారం ఉదయం ప్రారంభించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించి విద్యార్థులతో వారి ఆరోగ్య పరిస్థితుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ. రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలల వరకు ఉన్న ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండాలన్న దే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించగలరని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు. అందుకే పిల్లలకు అనారోగ్యం వచ్చిన తర్వాత వైద్యం చేయడం మాత్రమే కాకుండా, సమస్యలను ముందుగానే గుర్తించి నివారించే విధానానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే ఈ కార్యక్రమాన్ని గిరిజన పిల్లలు అధికంగా ఉన్న రంపచోడవరం ప్రాంతం నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్య సేవలే ప్రజలకు ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న వైద్యుల ఖాళీలను భర్తీ చేసే దిశగా కేవలం మూడు నెలల్లో 12 మంది వైద్యులను కేటాయించడం వల్ల పీహెచ్‌సీలలో వైద్య సేవలు మెరుగుపడ్డాయని చెప్పారు. నిర్మాణంలో ఉన్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ ఏడాది రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం-2.0 కింద 62,65,410 మంది చిన్నారులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. వీరిలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆరేళ్లలోపు చిన్నారులు 20,95,129 మంది, ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో చదువుతున్న ఆరు నుంచి 18 ఏళ్ల వయసు వారు 41,70,281 మంది ఉన్నారని వివరించారు. పుట్టుకతో వచ్చే లోపాలు, వివిధ వ్యాధులు, పోషకాహార లోపాలు, శారీరక మానసిక ఎదుగుదలలో ఆలస్యం సహా 38 రకాల ఆరోగ్య సమస్యలను ఈ పరీక్షల్లో గుర్తిస్తామన్నారు. జీవనశైలి విధానంలో వస్తున్న మార్పులకు తగ్గట్లు గతంలో ఉన్న పరీక్షలకు ఆదనంగా చిన్నారులకు అధిక రక్తపోటు,మధుమేహం, ఊబకాయం, మూత్రపిండాలు,మూత్రనాళ సమస్యలు,మానసిక ఇబ్బందులు,అధిక చరవాణి వినియోగం,నిద్రకు సంబంధించిన సమస్యలపైనా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. పిల్లల్లో సమస్యను ఎంత త్వరగా గుర్తిస్తే అంత సులభంగా చికిత్స చేయవచ్చని మంత్రి పేర్కొన్నారు. పుట్టుకతో వచ్చే గుండె సమస్యలు, పెదవి--అంగిలి చీలిక, కాళ్లలో పుట్టుకతో వచ్చే లోపాలు, నాడీ సంబంధిత సమస్యలు వంటివి చిన్న వయసులోనే గుర్తించి వైద్యం అందిస్తే భవిష్యత్తులో అంగవైకల్యం సహా అనేక సమస్యలను నివారించవచ్చన్నారు. ఆరోగ్య పరీక్షల్లో సమస్య బయటపడిన చిన్నారులను సమీప ప్రభుత్వ ఆసుపత్రులు, జిల్లా స్థాయి చిన్నారుల చికిత్స కేంద్రాలు, అవసరమైతే ఉన్నత వైద్య సంస్థలకు పంపించి ఉచితంగా చికిత్స అందిస్తున్నామని మంత్రి తెలిపారు. వ్యాధిని గుర్తించి పంపించడంతో బాధ్యత ముగిసినట్లు భావించకుండా, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి చిన్నారినీ పర్యవేక్షించాలనే స్పష్టమైన విధానంతో ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. రాష్ట్రంలో ఇందుకోసం 34 జిల్లా స్థాయి చిన్నారుల చికిత్స కేంద్రాలు పనిచేస్తున్నాయని, గత రెండేళ్లలో వీటి ద్వారా దాదాపు 4.85 లక్షల మంది చిన్నారులకు వైద్య సేవలు అందాయని చెప్పారు. చికిత్స అవసరమైన పిల్లలను ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక వాహన సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. గత రెండేళ్లలో బాల ఆరోగ్య కార్యక్రమం కింద 3,214 శస్త్రచికిత్సలు నిర్వహించామని, శస్త్రచికిత్సలు, నులిపురుగుల నివారణ, క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది సేవలు తదితరాల కోసం కలిపి సుమారు రూ.25.78 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి వెల్లడించారు. పిల్లల్లో చూపు సమస్యలను కూడా ముందుగానే గుర్తించేందుకు ఈ ఏడాది ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 43.30 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వారిలో చూపు సమస్యలున్న వారిని గుర్తించి అవసరమైన చికిత్సతో పాటు 2.50 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు అందించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.7 కోట్లు కేటాయించిందన్నారు. తమకు చూపు సరిగా లేదనే విషయాన్ని చాలామంది పిల్లలు బయటకు చెప్పుకోలేరని మంత్రి పేర్కొన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు బోర్డుపై రాసినది కనిపించకపోవడంతో చదువులో వెనుకబడే పరిస్థితి ఏర్పడవచ్చన్నారు. అలాంటి పిల్లలను చదువులో బలహీనులుగా భావించే అవకాశం కూడా ఉంటుందని చెప్పారు. అందుకే పాఠశాలకే వైద్య బృందాలను పంపించి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించడం ద్వారా చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కిశోర దశలో పిల్లలు శారీరక మార్పులతో పాటు మానసికంగా అనేక సమస్యలను ఎదుర్కొంటారని మంత్రి తెలిపారు. కొన్ని విషయాలను తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు చెప్పేందుకు సంకోచిస్తారని, సమస్యలను లోలోపలే దాచుకోవడం వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి పరిస్థితుల్లో వారికి దగ్గరగా ఉండే తోటి విద్యార్థులే మొదటి భరోసాగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్రీయ కిశోర స్వాస్థ్య కార్యక్రమాన్ని బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,317 కిశోర మైత్రి ఆరోగ్య కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, 61,556 మంది తోటి విద్యార్థి మార్గదర్శకులను సిద్ధం చేశామని తెలిపారు. ముఖ్యంగా కిశోర బాలికలు రుతుస్రావం,వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యల గురించి మాట్లాడేందుకు సంకోచించకూడదన్నారు. మానసిక సమస్యలను కూడా సాధారణ ఆరోగ్య సమస్యల మాదిరిగానే చూడాలని, ఎవరేమనుకుంటారోననే భయంతో వాటిని దాచుకోవద్దని విద్యార్థులకు మంత్రి సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పిల్లల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. "పిల్లల ఆరోగ్యమే వారి చదువుకు, కుటుంబాల ఆనందానికి, రాష్ట్ర భవిష్యత్తుకు పునాది. ఏ చిన్నారి కూడా ఆరోగ్య సమస్య కారణంగా చదువుకు, ఎదుగుదలకు దూరం కాకూడదు. పరీక్షలో సమస్య గుర్తించిన ప్రతి చిన్నారికి పూర్తిస్థాయి వైద్యం అందే వరకు ఆరోగ్య శాఖ బాధ్యత తీసుకోవాలి అని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ జీరో వేకెన్సీ పాలసీ వల్ల పోలవరం పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అవసరాలకు తగ్గట్టుగా అందుబాటులోకి వచ్చారని చెప్పారు. గిరిజనులకు వైద్య సేవలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పద్మావతి, జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ జె.విజయలక్ష్మి, పోలవరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి.సరిత,ఎమ్మెల్యే మిరియాల శిరీష,ఎస్టీ కమిషన్ చైర్మన్ సొళ్ళ బొజ్జి రెడ్డి,ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు , విద్యార్థులు పాల్గొన్నారు. మంత్రి తన ప్రసంగంలో కలెక్టర్ దినేష్ కుమార్ పరిపాలన సామర్థ్యం గురించి అభినందించారు.





# గుమ్ముడుపాడు గ్రామంలో తాగునీటి కష్టాలు..

## -యుద్ధప్రాతిపదికన సౌకర్యం కల్పించాలి -హ్యూమన్ రైట్స్ డిఫెండర్ బిడ్డ సింహాచలం డిమాండ్.





**అనంతగిరి: జూలై 30 (తెలుగు రాష్ట్రం విలేఖరి)**

గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి దానికి భిన్నంగా ఉందని హ్యూమన్ రైట్స్ డిఫెండర్ బిడ్డ సింహాచలం ఆవేదన వ్యక్తం చేశారు. అనంతగిరి మండలంలోని పెదబిడ్డ పంచాయితీ పరిధిలో గల గుమ్ముడుపాడు గ్రామంలో నేటికీ తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిడ్డ సింహాచలం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'జల్ జీవన్ మిషన్' వంటి ప్రతిష్టాత్మక పథకాల ద్వారా ప్రతి మారుమూల గ్రామానికి తాగునీరు అందిస్తున్నామని చెప్తున్నా, గుమ్ముడుపాడు గ్రామానికి మాత్రం ఆ ఫలాలు అందడం లేదన్నారు. ఈ శిఖర గ్రామంలో సుమారు 10 కుటుంబాలు, 45 మంది జనాభా జీవనం సాగిస్తున్నారని, కనీసం తాగడానికి నీరు లేక గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వివరించారు. గుమ్ముడుపాడు గ్రామాన్ని పంచాయితీ అధికారులు కనీసం గుర్తించకపోవడం, ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సింహాచలం అన్నారు. గ్రామంలోని తాగునీటి సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, సమాచారం అందించినా కనీస స్పందన కరువైందని మండిపడ్డారు. గుమ్ముడుపాడు గ్రామ సమస్యలపై ఇంత వివక్ష చూపిస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యుద్ధప్రాతిపదికన గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించి గిరిజనులను ఆదుకోవాలని కోరారు. స్థానిక అధికారులు స్పందించని పక్షంలో, ఐటీడీఏ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బిడ్డ సింహాచలం డిమాండ్ చేశారు.



# జూడో కరాటే అకాడమీని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు




**భీమవరం : జూలై 30తెలుగు రాష్ట్రం ప్రతినిధి.**

శారీరిక మానసిక సమతుల్యతకు, సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకునేందుకు మార్షల్ ఆర్ట్స్ దోహదం చేస్తాయని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం రెస్ట్ హౌస్ రోడ్డులో జూడో కరాటే మార్షల్ ఆర్ట్ అకాడమీను గురువారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. ఆత్మ రక్షణ కోసం కరాటే, జూడో శిక్షణ అవసరమని, మన ప్రాంతంలో జూడో కరాటే అకాడమీని ప్రారంభించడం అభినందనీయమన్నారు. బ్లాక్ బెల్ట్ నల్లం నాగేశ్వరరావు, డైరెక్టర్ గొల్లపల్లి సతీష్ కుమార్, గొల్లపల్లి అనిల్ కుమార్, కార్తీక్ మాట్లాడుతూ క్రీడల ద్వారా యువత శారీరకంగా మానసికంగా బలపడాలన్నారు. అనుభవజ్ఞులైన వారితో శిక్షణ అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు, వీర మహిళలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.



# ఆ ముగ్గురు పోటీకొచ్చినా..

## కేకేఆర్ కొత్త కెప్టెన్‌గా ఎవరూ ఊహించని ప్లేయర్..?



**అజింక్యా రహానే అనూహ్య రిటైర్మెంట్ నిర్ణయం కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) యాజమాన్యానికి పెద్ద షాక్ ఇచ్చింది. ఐపీఎల్ 2027 సీజన్ కోసం ఇప్పటికే పలు ఫ్రాంచైజీలు తమ సన్నాహాలు ముమ్మరం చేశాయి. కొన్ని జట్లు ప్రత్యేకంగా ఫిట్‌నెస్ క్యాంపులు నిర్వహిస్తుండగా, మరికొన్ని జట్లు కెప్టెన్ల మార్పుల దిశగా కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నాయి. సరిగ్గా ఇలాంటి సమయంలో రహానే తన క్రికెట్ కెరీర్ మొత్తానికి ఆకస్మికంగా వీడ్కోలు పలకడంతో కేకేఆర్ ఇప్పుడు అత్యవసరంగా కొత్త సారథిని ఎంచుకోవాల్సిన పరిస్థితుల్లో పడింది.**

మూడుసార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన కోల్‌కతా జట్టు, రహానే కెప్టెన్సీలో మాత్రం తీవ్రంగా నిరాశపరిచింది. గత రెండు సీజన్లలో కోల్‌కతా పాయింట్ల పట్టికలో వరుసగా ఎనిమిది, ఏడో స్థానాలతో సరిపెట్టుకుని ఘోరంగా విఫలమైంది. అంతకుముందు అద్భుతంగా టైటిల్ గెలిచిన ఈ జట్టు, రహానే రాకతో మళ్లీ అదే మ్యాజిక్ రిపీట్ చేస్తుందని అభిమానులు ఆశించినా ఫలితం దక్కలేదు. దీంతో కోల్‌కతా జట్టు పెద్దలు ఇప్పుడు సరికొత్త వ్యూహాలతో, నూతన ఉత్తేజంతో ముందుకెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

అందరి ఛాయిస్ రింకూ భాయ్..: కేకేఆర్ కొత్త కెప్టెన్ రేసులో అందరికంటే ముందు వరుసలో వినిపిస్తున్న పేరు అటాకింగ్ బ్యాటర్ రింకూ సింగ్. కోల్‌కతా బ్యాటింగ్ లైనప్‌లో ఉన్న భారతీయ ఆటగాళ్లలో అతడే అత్యంత సీనియర్. గత రెండేళ్లుగా రహానేకు నమ్మకమైన డిప్యూటీగా వ్యవహరిస్తూ నాయకత్వ బృందంలో ఒకడిగా కీలక పాత్ర పోషిస్తున్నాడు. కేవలం ఐపీఎల్‌లోనే కాకుండా యూపీ టీ20 లీగ్‌లో మీరట్ మావెరిక్స్ జట్టును విజయవంతంగా నడిపించాడు. ఆ జట్టును ఏకంగా రెండుసార్లు ఫైనల్‌కు చేర్చడమే కాకుండా, ఒకసారి సగర్వంగా టైటిల్ కూడా అందించాడు. జాతీయ జట్టుకు ఆడని సమయంలో ఉత్తరప్రదేశ్ దేశవాళీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తూ తన వ్యూహాత్మక బుర్రకు పదును పెడుతున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో అత్యంత తెలివైన కెప్టెన్లలో ఒకడిగా రింకూ గుర్తింపు తెచ్చుకున్నాడు. 28 ఏళ్ల ఈ డైనమిక్ బ్యాటర్‌కు కేకేఆర్ డ్రెస్సింగ్ రూమ్‌లో సీనియర్లు, జూనియర్లు, కోచింగ్ సిబ్బందితో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అతడికున్న విశేష ప్రజాదరణ కూడా బ్రాండ్ వాల్యూ పెంచుకునే దిశగా ఫ్రాంచైజీకి ప్లస్ పాయింట్ కానుంది.

కంగారూ స్టార్ కామెరాన్ గ్రీన్‌కు దక్కేనా?: ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ కోల్‌కతా జట్టులో చేరింది కేవలం ఒక సీజన్ మాత్రమే అయినా, తక్కువ కాలంలోనే అత్యంత విలువైన ఆటగాడిగా ఎదిగాడు. ఐపీఎల్ 2026 టోర్నీ ద్వితీయార్థంలో కేకేఆర్ జట్టు అద్భుతంగా పుంజుకోవడంలో గ్రీన్ పాత్ర అనన్య సామాన్యం. ఆ సీజన్‌లో తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ 322 పరుగులు సాధించడంతో పాటు ఏడు కీలక వికెట్లు పడగొట్టి తన సత్తా చాటాడు. అంతర్జాతీయ స్థాయిలో అతనికి కెప్టెన్సీ అనుభవం లేకపోయినా, మైదానంలో ఎప్పుడూ దూకుడుగా ఉండే అతడి నైజం జట్టుకు బాగా కలిసొచ్చే అంశం. సవాళ్లను ఎదుర్కోవడంలో గ్రీన్ ఎప్పుడూ ముందుంటాడు. భవిష్యత్తులో ఆస్ట్రేలియా జాతీయ జట్టుకు నాయకత్వం వహించే అరుదైన లక్షణాలు గ్రీన్‌లో పుష్కలంగా ఉన్నాయని ఆసీస్ మాజీ క్రికెటర్లు సైతం భావిస్తున్నారు. ఆ దూకుడుతోనే కేకేఆర్ మిడిలార్డర్‌ను స్థిరీకరించి జట్టును మళ్లీ విజయాల బాట పట్టించగల సామర్థ్యం అతనికి ఉంది.

మాస్టర్ స్ట్రోక్.. యువ సంచలనం రఘువంశీ..: కోల్‌కతా నైట్ రైడర్స్ శిబిరంలో ఉన్న మరో అత్యంత ఆశాజనకమైన యువ ప్రతిభావంతుడు 22 ఏళ్ల అంగ్క్రిష్ రఘువంశీ. తన అద్భుతమైన బ్యాటింగ్ టెక్నిక్‌తో, భారీ షాట్లతో గత మూడు సీజన్లుగా తుది జట్టులో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడు. ఐపీఎల్ 2026 టోర్నీ మధ్యలో తీవ్రంగా గాయపడి శస్త్రచికిత్స చేయించుకున్నా, అతడి అపారమైన ప్రతిభపై యాజమాన్యానికి పూర్తి నమ్మకం ఉంది. ప్రొఫెషనల్ స్థాయిలో కెప్టెన్సీ అనుభవం లేకున్నా, ముంబై అండర్-23 రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఆడిన అన్ని మ్యాచ్‌ల్లో నూరు శాతం విజయాల రికార్డును సొంతం చేసుకున్నాడు. ఐపీఎల్ 2027 టోర్నీ తర్వాత మెగా వేలం జరగనున్న నేపథ్యంలో, ఇప్పుడు ఒక యువ ఆటగాడికి పగ్గాలు అప్పగిస్తే రాబోయే పదేళ్ల పాటు జట్టుకు అద్భుతమైన సేవలందిస్తాడని యాజమాన్యం దీర్ఘకాలిక ఆలోచన చేస్తోంది. ఒకనాడు ముంబై ఇండియన్స్ యువ ప్లేయర్ రోహిత్ శర్మకు పగ్గాలు అప్పగించి ఎలా చారిత్రక విజయాలు సాధించిందో, అదే ఫార్ములాను రఘువంశీతో రిపీట్ చేయాలని కేకేఆర్ గట్టిగా భావిస్తోంది.

రహానే ఆటకు అకస్మాత్తుగా వీడ్కోలు పలకడంతో కోల్‌కతా యాజమాన్యం తీసుకునే తదుపరి నిర్ణయంపై క్రీడాలోకంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది. అనుభవాన్ని నమ్ముకుని రింకూ లేదా గ్రీన్‌కు పగ్గాలు అప్పగిస్తారా, లేక భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అంగ్క్రిష్ రఘువంశీ వైపు మొగ్గుచూపుతారా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# తొలి ఇన్నింగ్స్‌లో హీరోలు..



**టెస్ట్ క్రికెట్‌లో పాకిస్థాన్ జట్టు పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. మొదటి ఇన్నింగ్స్‌లో కాస్తోకూస్తో రాణిస్తున్న బ్యాటర్లు, రెండో ఇన్నింగ్స్‌కు వచ్చేసరికి పూర్తిగా చేతులెత్తేస్తున్నారు. ఈ దారుణమైన వైఫల్యం కారణంగా ఆ జట్టు వరుస పరాజయాలను మూటగట్టుకుంటోంది. గడిచిన రెండేళ్లలో పాకిస్థాన్ పేరిట నమోదైన చెత్త రికార్డులే ఇందుకు నిదర్శనం.**

వెస్టిండీస్‌తో టరౌబాలోని బ్రియాన్ లారా క్రికెట్ అకాడమీ వేదికగా జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ బ్యాటింగ్ వైఫల్యం మరోసారి బట్టబయలైంది. 211 పరుగుల లక్ష్య ఛేదన కోసం నాలుగో రోజు బరిలోకి దిగిన ఆ జట్టు బ్యాటర్లు దారుణంగా కుప్పకూలారు. అంతకుముందు బంగ్లాదేశ్ చేతిలో 2-0 తేడాతో సిరీస్ కోల్పోయిన తర్వాత, పాక్ సెలెక్టర్లు బౌలింగ్ విభాగంలో ఏకంగా ఐదు మార్పులు చేసి బరిలోకి దిగారు. సిల్హెట్ టెస్టులో ఆరుగురు బౌలర్లను ప్రయోగించిన జట్టు, టరౌబాలో మాత్రం పాత బౌలర్లలో ఇద్దరిని మాత్రమే కొనసాగించింది. ఒక స్పెషలిస్ట్ బ్యాటర్‌ను తగ్గించి అదనపు పేసర్‌ను ఆడించినా కూడా వారికి సానుకూల ఫలితం దక్కలేదు.

### ఇమామ్-ఉల్-హక్ నిర్లక్ష్యం.. కోచ్ ఆవేదన..

తొలి ఇన్నింగ్స్‌లో 63 పరుగులతో ఆకట్టుకున్న ఓపెనర్ ఇమామ్-ఉల్-హక్.. లక్ష్య ఛేదనలో మాత్రం కీమర్ రోచ్ బౌలింగ్‌లో అత్యంత నిర్లక్ష్యమైన షాట్ ఆడి వికెట్ పారేసుకున్నాడు. కొత్త డ్యూక్స్ బంతిని ఎదుర్కొనేందుకు తాము తగినంత ప్రాక్టీస్ చేశామని ఇమామ్ అంతకుముందే వ్యాఖ్యానించాడు. తొలి ఇన్నింగ్స్‌లో షాన్ మసూద్‌తో కలిసి 156 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన ఇమామ్, విండీస్ పేస్ ఎటాక్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. కానీ రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం తీవ్రంగా నిరాశపరిచాడు. ఈ ఓటమిపై పాకిస్థాన్ హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. "ఇమామ్ తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతంగా ఆడాడు. అతను కాస్త సంయమనంతో భారీ ఇన్నింగ్స్ ఆడి ఉంటే ఆధిక్యం లభించేది. రెండో ఇన్నింగ్స్‌లో త్వరగా వికెట్లు కోల్పోవడం జట్టును తీవ్రంగా దెబ్బతీస్తోంది" అని కోచ్ అంగీకరించాడు.

గడిచిన రెండేళ్ల కాలంలో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) ఆడుతున్న మొత్తం 9 జట్లలో రెండో ఇన్నింగ్స్‌లో అత్యంత చెత్త సగటు (19.90) పాకిస్థాన్‌దే కావడం గమనార్హం. మొదటి, రెండో ఇన్నింగ్స్‌ల బ్యాటింగ్ సగటు మధ్య వ్యత్యాసం ఏకంగా 11.03 శాతంగా ఉంది. మొదటి ఇన్నింగ్స్‌లో 30.93 సగటుతో ఉన్న జట్టు, రెండో ఇన్నింగ్స్‌లో 19.90కు పడిపోతోంది. ఈ జాబితాలో రెండంకెల వ్యత్యాసం ఉన్న ఏకైక జట్టు కూడా పాకిస్థానే కావడం వారి వైఫల్యానికి అద్దం పడుతోంది.

గత రెండేళ్లలో కేవలం నాలుగు టెస్టులే ఆడిన ఇమామ్-ఉల్-హక్ తొలి ఇన్నింగ్స్‌లో 54.50 సగటుతో టాప్‌లో ఉండగా, రెండో ఇన్నింగ్స్‌లో అది దారుణంగా 3.50కి పడిపోయింది. ఇక మహ్మద్ రిజ్వాన్ సగటు 22 పాయింట్లు, సౌద్ షకీల్ సగటు 23.5 పాయింట్ల మేర పడిపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

కేవలం బౌలింగ్ విభాగంపైనే దృష్టి పెట్టిన సెలెక్టర్లు.. బ్యాటింగ్ వైఫల్యాలను సరిదిద్దడంలో పూర్తిగా విఫలమయ్యారని స్పష్టమవుతోంది. విదేశీ గడ్డపై పాకిస్థాన్ వరుసగా ఎనిమిది టెస్టుల్లో ఓడిపోవడం జట్టు చరిత్రలో ఇదే తొలిసారి. ఈ కాలంలో ఆడిన 14 మ్యాచ్‌లలో ఏకంగా 10 పరాజయాలు ఆ జట్టు ఖాతాలో చేరాయి. మూడో రోజు ఉదయానికే మిడిలార్డర్ కుప్పకూలగా, కనీసం నాలుగో రోజు కూడా పోరాడకుండా కెప్టెన్ మినహా మిగతా బ్యాటర్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు.

# భారత్ వస్తుందని ఆశిస్తున్నా.. బంగ్లా అత్యంత సురక్షితం: తమీమ్ ఇక్బాల్

బంగ్లాదేశ్‌లో టీమ్ఇండియా పర్యటనపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. షెడ్యూల్ ప్రకారం గతేడాది ఆగస్టులో మూడు వన్డేలు, మూడు టీ20లను ఆడేందుకు భారత్ వెళ్లాలి. కానీ, ఆ దేశంలో ఉన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో నాడు సిరీస్ జరగలేదు. ఆ పర్యటనను ఈ ఏడాది సెప్టెంబర్‌కు వాయిదా వేస్తూ అప్పుడు నిర్ణయం తీసుకున్నారు. అయితే, బంగ్లాదేశ్‌లో భద్రతపరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉద్దేశంతో బీసీసీఐ పునరాలోచనలో పడింది. ఈ క్రమంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు తమీమ్ ఇక్బాల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తప్పకుండా తమ దేశానికి వస్తుందనే నమ్మకం ఉందన్నారు. "భారత్‌తో సిరీస్ గురించి ఇప్పుడే చెప్పలేను. కానీ, తప్పకుండా ఆ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటిస్తుందని ఆశిస్తున్నా. ఇప్పటికే బీసీసీఐతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఈమెయిల్స్ రూపంలోనూ చర్చలు జరుగుతున్నాయి. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నాం. భారత్ - బంగ్లాదేశ్ మధ్య సిరీస్ మరింత ఆసక్తికరంగా ఉంటుందని భావిస్తున్నా. బంగ్లా అత్యంత సురక్షితమైన దేశం. ఇక్కడ వారికి ఎలాంటి భద్రతాపరమైన ఇబ్బందులు ఉండవు. మా వైపు నుంచి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నాం" అని తమీమ్ స్పష్టం చేశారు.

భారత క్రికెట్ క్యాలెండర్‌లో సెప్టెంబర్ విండో ఖాళీగా లేదు. అఫ్గాన్‌తో మూడు టీ20ల సిరీస్‌లో టీమ్ఇండియా తలపడనుంది. ఇప్పుడు బంగ్లా పర్యటనను ఖరారు చేస్తే అఫ్గాన్‌తో సిరీస్‌ను వాయిదా వేయాల్సి ఉంటుంది. దీనిపైనా తమీమ్ స్పందిస్తూ "బీసీబీ అధ్యక్షుడిగా నాకూ కొన్ని పరిమితులు ఉంటాయి. వాటిని నేను క్రాస్ చేయలేను. నా బాధ్యత పరిధిలో సాధ్యమైనంత వరకూ సంబంధిత వ్యక్తులతో మాట్లాడుతూనే ఉన్నా. బంగ్లాతో సిరీస్ ఆడితే ప్రయోజనం ఏంటనేది వారికి వివరించే ప్రయత్నం చేస్తున్నా" అని తమీమ్ వ్యాఖ్యానించారు.

# 401 మ్యాచ్‌లు.. 991 వికెట్లు..

## క్రికెట్ హిస్టరీలో తోపు ప్లేయర్..

## అరుదైన రికార్డుల్లో స్వింగ్ కింగ్..!



**టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఫాస్ట్ బౌలింగ్ అనగానే క్రీడాభిమానులకు ముందుగా గుర్తొచ్చే ఏకైక పేరు జేమ్స్ అండర్సన్. తన అద్భుతమైన స్వింగ్ బౌలింగ్‌తో ప్రపంచంలోని ఎంతటి దిగ్గజ బ్యాటర్లకైనా చెమటలు పట్టించిన ఈ ఇంగ్లాండ్ పేస్ గండర గండుడి పుట్టినరోజు నేడు. ఈ అద్భుతమైన సందర్భంగా క్రికెట్ ప్రపంచంలో ఒక సజీవ లెజెండ్‌గా నిలిచిన అండర్సన్ సృష్టించిన అరుదైన రికార్డులు, అతడి ఘనతలపై ఒక లుక్కేద్దాం.**

క్రికెట్ ప్రపంచంలో ఎన్నో అద్భుతాలు జరుగుతుంటాయి. ఎంతో మంది స్టార్లు వస్తుంటారు, పోతుంటారు. కానీ చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోయే పేర్లు కొన్నే ఉంటాయి. అందులో ఒకటి కచ్చితంగా జేమ్స్ అండర్సన్. జేమ్స్ అండర్సన్ బంతి పట్టుకుని మైదానంలోకి దిగాడంటే చాలు ప్రత్యర్థి బ్యాటర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తాల్సిందే. సుదీర్ఘ ఫార్మాట్ అయిన టెస్ట్ క్రికెట్‌లో ఎన్నో ఏళ్లుగా చెక్కుచెదరని ఆధిపత్యం చలాయిస్తూ అత్యధిక వికెట్లు పడగొట్టిన అగ్రశ్రేణి ఫాస్ట్ బౌలర్‌గా అండర్సన్ ఎవరికీ సాధ్యంకాని అరుదైన చరిత్ర సృష్టించాడు. క్రికెట్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఏ ఫాస్ట్ బౌలర్ కూడా అందుకోలేని ఏడు వందలకు పైగా టెస్ట్ వికెట్ల అద్భుతమైన మైలురాయిని దాటిన ఏకైక పేసర్‌గా సగర్వంగా నిలిచాడు. ఫాస్ట్ బౌలర్ల విభాగంలో అత్యధిక టెస్ట్ వికెట్లు తీసిన రికార్డు ఇతడి సొంతం. ఫాస్ట్ బౌలింగ్ అనేది ఎంతో శారీరక శ్రమతో కూడుకున్న పని. సాధారణంగా ఫాస్ట్ బౌలర్లకు గాయాలు ఎక్కువవుతుంటాయి, దాంతో వారి కెరీర్ చాలా త్వరగా ముగుస్తుంది. కానీ అండర్సన్ తన అసాధారణమైన ఫిట్‌నెస్‌తో దశాబ్దాల పాటు ఇంగ్లాండ్ పేస్ దళాన్ని ముందుండి నడిపించాడు.

### టెస్ట్ చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శన..

ఓవరాల్‌గా టెస్ట్ క్రికెట్ చరిత్రను నిశితంగా పరిశీలిస్తే, ప్రపంచంలోనే అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో జేమ్స్ అండర్సన్ మూడో స్థానంలో సగర్వంగా నిలిచాడు. ఈ ఘనత సాధించడం ఒక పేసర్‌కు ఎంత కష్టమో క్రీడా పండితులకు బాగా తెలుసు. దిగ్గజ స్పిన్నర్ల తర్వాత ఆ స్థాయిలో వికెట్ల వరద పారించిన ఏకైక బౌలర్ అండర్సన్ మాత్రమే కావడం విశేషం. ఇంగ్లాండ్ క్రికెట్ జట్టు తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అతడి రికార్డు పదిలంగా ఉంది. ఇంగ్లీష్ గడ్డపై పచ్చికతో నిండిన పిచ్‌లపైనైనా, ఆసియా ఖండంలోని స్పిన్ అనుకూల పిచ్‌లపైనైనా బంతిని రెండు వైపులా అద్భుతంగా స్వింగ్ చేస్తూ బ్యాటర్లను బోల్తా కొట్టించడంలో అతనికి అతనే సాటి. ఇంగ్లాండ్ జట్టు సాధించిన ఎన్నో అపూర్వమైన చారిత్రక విజయాల్లో అండర్సన్ పాత్ర చిరస్మరణీయం.

### సుదీర్ఘ ప్రస్థానం.. అంతులేని అనుభవం..

శారీరకంగా ఎంతో కష్టమైన ఫాస్ట్ బౌలింగ్ విభాగంలో ఒక ఆటగాడు ఇన్నేళ్ల పాటు కెరీర్ కొనసాగించడం అంటే మాటలు కాదు. అండర్సన్ తన అంకితభావంతో, కఠోర శ్రమతో వాటన్నింటినీ సుసాధ్యం చేశాడు. అందుకే ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన క్రికెటర్ల జాబితాలో జేమ్స్ అండర్సన్ ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలిచి తన సత్తా ఏంటో నిరూపించాడు. ఇన్ని టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన ఫాస్ట్ బౌలర్ మరొకరు లేకపోవడం అతని అంకితభావానికి నిలువెత్తు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ప్రతి మ్యాచ్‌లోనూ అలుపెరగకుండా గంటల తరబడి బౌలింగ్ చేస్తూ సుదీర్ఘమైన స్పెల్స్ వేశాడు. తన సుదీర్ఘమైన ప్రస్థానంలో ఎంతోమంది యువ బౌలర్లకు మార్గదర్శకుడిగా నిలిచాడు. జాతీయ జట్టు కోసం తన జీవితంలో అత్యధిక భాగాన్ని ధారపోసిన గొప్ప క్రికెటర్‌గా క్రీడాభిమానుల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయాడు.

### స్వింగ్ కింగ్.. ఎప్పటికీ నిలిచిపోయే లెజెండ్!

ఒక సాధారణ యువకుడిగా అరంగేట్రం చేసినప్పటి నుంచి, క్రికెట్ ఆటలో ఎప్పటికీ గుర్తుండిపోయే ఒక చిరస్మరణీయమైన దిగ్గజంగా మారే వరకు అండర్సన్ సాగించిన ప్రయాణం ప్రతి ఒక్కరికీ ఎంతో స్ఫూర్తిదాయకం. గాల్లో బంతిని స్వింగ్ చేయడంతో పాటు, పిచ్‌పై పడిన తర్వాత బంతిని కచ్చితత్వంతో సీమ్ చేయడంలో అతడికి సాటిలేరెవరు. అతనిలా బంతిని స్వింగ్ చేయగల నైపుణ్యం మరే బౌలర్‌కు లేదంటే అతిశయోక్తి కాదు.

# ముంబైలో లగ్జరీ ఫ్లాట్ కొన్న విరుష్క జోడీ..

## ప్రత్యేకతలు తెలిస్తే మైండ్ బ్లాకే..!




**టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ, బాలీవుడ్ నటి అనుష్క శర్మ దంపతులు మరో భారీ ఆస్తిని తమ ఖాతాలో వేసుకున్నారు. ముంబైలోని అత్యంత ఖరీదైన ప్రాంతంలో దాదాపు రూ. 18.29 కోట్లతో ఓ అద్భుతమైన లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేశారు. వీరి రియల్ ఎస్టేట్ సామ్రాజ్యంలో చేరిన ఈ సరికొత్త ఇల్లు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.**

### అంధేరీ వెస్ట్‌లో సరికొత్త ఆస్తి..

దేశంలోనే మోస్ట్ పాపులర్ సెలబ్రిటీ జోడీగా పేరుగాంచిన విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ దంపతులు మరోసారి వార్తల్లో నిలిచారు. పసిడి వెలుగులు విరజిమ్మే ముంబై మహానగరంలో సరికొత్త లగ్జరీ ఫ్లాట్‌ను వీరు సొంతం చేసుకున్నారు. ముంబై అంధేరీ వెస్ట్ ప్రాంతంలో ఉన్న వర్సోవా పరిధిలోని 'గోద్రేజ్ స్కైషోర్' ప్రాజెక్టులో ఈ అత్యాధునిక అపార్ట్‌మెంట్ కొనుగోలు చేశారు. దీని మొత్తం విలువ దాదాపు రూ. 18.29 కోట్లుగా నమోదైంది. రియల్ ఎస్టేట్ రికార్డులను పర్యవేక్షించే ప్రముఖ సంస్థ జాప్‌కీ పత్రాల ప్రకారం ఈ క్రయవిక్రయాలు అధికారికంగా పూర్తయ్యాయి.

### కార్ పార్కింగ్ నుండి స్పేస్ దాకా.. ఫ్లాట్ విశేషాలు ఇవే..!

ఈ సరికొత్త అపార్ట్‌మెంట్ నిర్మాణం, నిర్మాణాత్మక సౌకర్యాల పరంగా ఎంతో అద్భుతంగా రూపుదిద్దుకుంది. మొత్తం 2,644 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ ఫ్లాట్ భవనంలో పై అంతస్తులలో నెలకొంది. దీనికి అదనంగా మరో 316 చదరపు అడుగుల ఎక్స్‌క్లూజివ్ ఏరియా లభిస్తుంది. అంతేకాకుండా, ఈ ఫ్లాట్ కొనుగోలుదారులకు ప్రత్యేకంగా మూడు కార్ పార్కింగ్ స్లాట్లను కేటాయించారు. సముద్ర తీర ప్రాంతానికి అత్యంత సమీపంలో ఉండటం, అత్యాధునిక రక్షణ వ్యవస్థలు అందుబాటులో ఉండటం వల్ల ఈ ప్రాజెక్టుకు బాలీవుడ్, క్రీడా రంగ ప్రముఖుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.

### పెరిగిపోతున్న విరుష్కా ఆస్తుల సామ్రాజ్యం..

విరాట్, అనుష్క దంపతులకు రియల్ ఎస్టేట్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టే అలవాటు ఉంది. ఇప్పటికే వీరి పేరిట దేశంలోని పలు కీలక ప్రాంతాల్లో అత్యంత ఖరీదైన ఆస్తులు ఉన్నాయి. హర్యానాలోని గురుగ్రామ్‌లో వీరికి దాదాపు రూ. 80 కోట్ల విలువైన విలాసవంతమైన బంగ్లా ఉంది. అలాగే ముంబైలోని వర్లీ ప్రాంతంలో ఉన్న ఆంకార టవర్స్‌లో సుమారు రూ. 34 కోట్ల విలువైన సీ-ఫేసింగ్ అపార్ట్‌మెంట్‌లో వీరు ప్రస్తుతం నివాసముంటున్నారు. దీనితో పాటు అలీబాగ్ ప్రాంతంలో నిర్మించుకున్న ఫామ్‌హౌస్ సైతం వీరి లగ్జరీ జీవనశైలికి ప్రతీకగా నిలుస్తోంది.

### దేశంలోనే అత్యంత సంపన్న సెలబ్రిటీ జంట..

మైదానంలో విరాట్ కోహ్లీ బాదించే సిక్సర్లు, చిత్రసీమలో అనుష్క శర్మ ఆర్జించే విజయం వీరిని దేశంలోనే అగ్రగామి బ్రాండ్‌లుగా నిలబెట్టాయి. బ్రాండ్ ఎండోర్స్‌మెంట్లు, సొంత వ్యాపారాలు, క్రికెట్ పారితోషికాల ద్వారా వీరు సంపాదనలో సరికొత్త మైలురాళ్లను అధిగమిస్తున్నారు. సంపాదించిన డబ్బును ల్యాండ్, ప్రాపర్టీలలో సురక్షితంగా పెట్టుబడి పెట్టడంలో ఈ జోడీ ఎప్పుడూ ముందే ఉంటుంది. ముంబైలో కొత్తగా కొనుగోలు చేసిన ఈ లగ్జరీ ఫ్లాట్ వీరి వ్యాపార దృష్టిని, భవిష్యత్ ప్రణాళికలను స్పష్టంగా తెలియజేస్తోంది.

# 'కాంతార' హీరోకు మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం



'కాంతార' చిత్రంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టికి అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవం లభించింది. ఆస్ట్రేలియాలో నిర్వహించే ప్రతిష్ఠాత్మక 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్' (×ఖీఖీవీ) 2026లో ఆయన 'లీడర్‌షిప్ ఇన్ సినిమా' పురస్కారానికి ఎంపికయ్యారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తన సినిమాల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసినందుకు గాను ×ఖీఖీవీ ఈ అవార్డుతో ఆయన్ను సత్కరించనుంది. ఆగస్టు 13న మెల్‌బోర్న్‌లో జరగనున్న వేడుకలో రిషబ్ శెట్టి ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ గౌరవంపై రిషబ్ శెట్టి స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. "ఈ పురస్కారానికి ఎంపికవడం చాలా గౌరవంగా భావిస్తున్నాను. మన సంస్కృతిని, మూలాలను ప్రతిబింబించే కథలకే నేను ఎప్పుడూ ప్రాధాన్యతనిస్తాను. ఇటువంటి కథలు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకోవడం సంతోషాన్నిస్తోంది. మెల్‌బోర్న్‌లో భారతీయ సినిమా వైవిధ్యాన్ని అందరితో కలిసి వేడుక చేసుకోవడానికి ఎదురుచూస్తున్నాను" అని రిషబ్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రిషబ్ శెట్టి ప్రస్తుతం ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్' చిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.

# బాలీవుడ్ నటికి సైబర్ షాక్...

## రూ. 2.43 లక్షలు కాజేసిన మోసగాళ్లు




ప్రముఖ బాలీవుడ్ నటి, నిర్మాత కీర్తి కుల్హారి సైబర్ మోసానికి గురయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆమె క్రెడిట్ కార్డు నుంచి అనధికారికంగా రూ. 2,43,852 మేర లావాదేవీలు జరపడంతో ఆమె ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అంబోలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, నగర సైబర్ సెల్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే, జూలై 24 రాత్రి ఈ సైబర్ మోసం చోటుచేసుకుంది. అంధేరి వెస్ట్‌లోని ఓ మల్టీప్లెక్స్ వద్ద ఉన్న సమయంలో కీర్తి మొబైల్ ఫోన్‌కు బ్యాంకు నుంచి ఒక సందేశం వచ్చింది. ఆమె క్రెడిట్ కార్డును ఉపయోగించి ఏరోమెక్సికో ఎయిర్‌లైన్స్‌లో 2,525 యూఎస్ డాలర్ల విలువైన లావాదేవీ జరిగినట్లు అందులో ఉంది. దీంతో అప్రమత్తమైన ఆమె వెంటనే బ్యాంకు కస్టమర్ కేర్‌ను సంప్రదించారు. బ్యాంకు అధికారులు ఆమె ఖాతాను పరిశీలించగా, నిమిషాల వ్యవధిలోనే మొత్తం నాలుగు అనధికారిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. వాటి మొత్తం విలువ రూ. 2.43 లక్షలకు పైగా ఉండటంతో, తదుపరి నష్టం జరగకుండా బ్యాంకు తక్షణమే ఆ కార్డును బ్లాక్ చేసింది. తాను తన క్రెడిట్ కార్డు పాస్‌వర్డ్, పిన్ లేదా ఇతర రహస్య వివరాలను ఎవరితోనూ పంచుకోలేదని కీర్తి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో స్పష్టం చేశారు. మాల్వేర్ లేదా స్పైవేర్ ద్వారా ఆమె ఫోన్ లేదా కార్డు వివరాలను సైబర్ నేరగాళ్లు తస్కరించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.
'పింక్', 'యూరి: ది సర్జికల్ స్ట్రైక్', 'మిషన్ మంగళ్' వంటి చిత్రాలతో పాటు 'ఫోర్ మోర్ షాట్స్ ప్లీజ్!', 'స్కూప్' వంటి వెబ్ సిరీస్‌లతో కీర్తి కుల్హారి ప్రేక్షకులకు సుపరిచితులు.

# యూరప్ పర్యటనలో పూజా హెగ్డే అల్లరే అల్లరి.



. ప్రేమలో పడ్డ ఫ్యాన్స్! సోషల్ మీడియాలో ఈ పోస్ట్‌కు కామెంట్ల సెక్షన్ అభిమానుల ప్రేమతో నిండిపోయింది. వేలాది మంది అభిమానులు హార్ట్- ఫైర్ ఎమోజీలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. నేటి జెన్ -జీలో వరుసగా పాన్ ఇండియన్ సినిమాల్లో నటిస్తున్న క్రేజీ బ్యూటీ పూజా హెగ్డే. దురదృష్టవశాత్తూ సోలో హీరోయిన్ గా చేసిన చాలా సినిమాలు ఫ్లాపులు అయినా.. ఈ అమ్మడికి అవకాశాల పరంగా కొదవేమీ లేదు. ఇండస్ట్రీ టాప్ బ్యూటీగా ఏల్తున్న పూజా హెగ్డే సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉంటూ తన లేటెస్ట్ అప్‌డేట్స్‌తో అభిమానులను అలరిస్తోంది. తాజాగా ఈ ముంబై బ్యూటీ హంగేరీ రాజధాని బుడాపెస్ట్ నగర పర్యటనకు సంబంధించిన విశేషాలను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేయగా ఫ్యాన్స్ లో వైరల్ గా మారుతున్నాయి.పాత్ర కోసం ఎంతకైనా: 'పెద్ది' కోసం చరణ్- మహావతార్ కోసం విక్కీ --దీనికంటే ఉత్తమమైన ట్రాక్‌ను ఎంచుకోలేకపోయేదాన్ని-- అనే క్యాప్షన్‌తో పూజా హెగ్డే షేర్ చేసిన ఫొటోలు -వీడియోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి. యూరప్‌లోని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని.. అక్కడి వీధుల్లో తను గడిపిన సరదా మూవ్ మెంట్స్ ను ఈ పోస్ట్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఈ లేటెస్ట్ ఫోటోగ్రాఫ్స్ లో పూజా హెగ్డే సరికొత్త హెయిర్ స్టైల్.. స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో మెరిసిపోతూ కనిపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త షార్ట్ హెయిర్ కట్‌తో కనిపిస్తుండటంతో ఫ్యాషన్ ప్రియులు- అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. యూరప్‌లోని ఎండలో ఈ బ్యూటీ మెరిసిపోతున్న తీరును చూసి --యూరోపియన్ సన్ నీకు బాగా సరిపోయింది-- అంటూ నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. పూజా షార్ట్ స్కర్ట్ - క్లాసిక్ స్టైల్‌లో కనిపించిన విధానం జెన్-జెడ్ ఫ్యాషన్ ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. 'రన్ రాజా రన్' బుజ్జిమా ఎమోషనల్ పోస్ట్ సోషల్ మీడియాలో ఈ పోస్ట్‌కు కామెంట్ల సెక్షన్ అభిమానుల ప్రేమతో నిండిపోయింది. వేలాది మంది అభిమానులు హార్ట్- ఫైర్ ఎమోజీలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. బ్యూటీ, జార్జియస్, ఏంజెల్ అంటూ కొందరు పొగడ్తలతో ముంచెత్తగా.. మరికొందరు పూజా నటనకు, అందానికి జేజేలు పలుకుతూ సుదీర్ఘమైన కవితాత్మక కామెంట్లను కూడా జత చేశారు. బుట్టబొమ్మ సహజసిద్ధమైన అందం, క్యూట్ హావభావాలు ప్రతి ఒక్కరినీ అమితంగా ఆకట్టుకుంటున్నాయని ప్రశంసిస్తున్నారు.

# 100 కోట్ల క్లబ్‌లో చేరిన అఖిల్ 'లెనిన్'..!



అక్కినేని అఖిల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి, అఖిల్ కెరీర్‌లో తొలి 100 కోట్ల క్లబ్ చిత్రంగా నిలిచింది. ఈ విజయంతో అఖిల్ అభిమానుల్లో సంబరాలు నెలకొన్నాయి.
మాస్ యాక్షన్, ఎమోషనల్ కథాంశం, ఆకట్టుకునే స్క్రీన్‌ప్లే, భారీ నిర్మాణ విలువలు 'లెనిన్' విజయానికి ప్రధాన కారణాలుగా సినీ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా అఖిల్ నటన, యాక్షన్ సన్నివేశాలు, డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'లెనిన్'కు మంచి స్పందన రావడంతో వసూళ్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

వీకెండ్‌లో థియేటర్ల వద్ద హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించగా, అనేక ప్రాంతాల్లో అదనపు షోలు కూడా ఏర్పాటు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విజయంతో అఖిల్ తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించినట్లుగా సినీ పరిశ్రమ భావిస్తోంది. ఇప్పటి వరకు సరైన కమర్షియల్ బ్రేక్ కోసం ఎదురుచూసిన అఖిల్‌కు 'లెనిన్' భారీ విజయాన్ని అందించడంతో పాటు స్టార్ హీరోల జాబితాలో మరింత బలమైన స్థానం సంపాదించుకునే అవకాశం కల్పించింది.

సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా అఖిల్‌కు అభినందనలు తెలుపుతున్నారు. చిత్రబృందం కూడా ప్రేక్షకుల ఆదరణకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ విజయాన్ని అభిమానులకే అంకితం చేసింది. ప్రస్తుతం 'లెనిన్' విజయవంతంగా ప్రదర్శితమవుతుండగా, రాబోయే రోజుల్లో మరిన్ని వసూళ్ల రికార్డులు నమోదు చేసే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




# స్టార్ హీరోలకు తలనొప్పి తెచ్చిన అల్లు అర్జున్ ?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇటీవలే హైదరాబాద్‌లో తన అభిమాన సంఘం (ూూఖీూ) ఆధ్వర్యంలో సుమారు 900 మందికి పైగా అభిమానులతో ఒకే వేదికపై దాదాపు 6 గంటల పాటు గడిపిన భారీ 'ఫ్యాన్ మీట్' టాలీవుడ్‌లో సరికొత్త చర్చకు దారితీసింది. అభిమానులకు ఇన్సూరెన్స్ కార్డులు అందించడం, ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా ఫోటోలు దిగడమే కాకుండా, ఇకపై ప్రతి ఆరు నెలలకోసారి ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేస్తానని ఆయన ప్రకటించారు. అల్లు అర్జున్ తీసుకున్న ఈ నిర్ణయం మిగతా టాలీవుడ్ స్టార్ హీరోల అభిమానుల్లో సరికొత్త ఆశలను రేకెత్తించింది. తమ హీరోలు కూడా తెరపై మాత్రమే కాకుండా, ఏడాదికి కనీసం ఒకసారైనా తమను నేరుగా కలిసి ఈ విధంగా సమయం కేటాయించాలని ఇతర పెద్ద హీరోల ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేయడం ప్రారంభించారు.

**సోషల్ మీడియాలో ట్రెండ్స్.. స్టార్ హీరోలకు తప్పని ఇబ్బందులు!**

అల్లు అర్జున్ వేసిన ఈ అడుగు ఇప్పుడు టాలీవుడ్‌లోని ఇతర అగ్ర హీరోలకు ఒక రకమైన సవాలుగా లేదా తలనొప్పిగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం టాలీవుడ్ స్టార్ హీరోలు ఒక్కో భారీ ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి రెండు నుంచి మూడేళ్ల సమయం తీసుకుంటున్నారు. సుదీర్ఘ షూటింగ్ షెడ్యూళ్లు, విదేశీ ప్రయాణాలు మరియు పాన్-ఇండియా ప్రమోషన్లలో తీరిక లేకుండా గడుపుతున్న హీరోలకు ప్రత్యేకంగా ఫ్యాన్ మీట్స్ ఏర్పాటు చేయడం అంత సులభమైన విషయం కాదు. అయితే, "అల్లు అర్జున్ సాధ్యం చేసినప్పుడు మీరెందుకు చేయలేరు?" అని ఫ్యాన్స్ తమ అభిమాన హీరోల పేర్లను ౩ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్‌లలో ట్యాగ్ చేస్తూ పట్టుబడుతుండటంతో హీరోలతో పాటు వారి పిఆర్ (ూ=) బృందాలకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. సినిమా విడుదలల ఆలస్యంతో ఇప్పటికే నిరాశలో ఉన్న అభిమానులను ప్రసన్నం చేసుకోవాలంటే, ఇకపై స్టార్ హీరోలు కూడా తమ బిజీ షెడ్యూల్‌లో ఫ్యాన్ మీట్స్‌కు సమయం కేటాయించక తప్పని పరిస్థితి ఏర్పడుతోంది.

# కేబీసీ కొత్త సీజన్‌కు అమితాబ్ రెడీ..


## 'ఇక అసలు పరీక్ష' అంటున్న బిగ్‌బి



బాలీవుడ్ 'షెహెన్‌షా' అమితాబ్ బచ్చన్ మరోసారి బుల్లితెర ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ప్రముఖ రియాలిటీ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' (కేబీసీ) 18వ సీజన్ చిత్రీకరణకు సన్నాహాలు పూర్తయ్యాయి. ఈ విషయాన్ని బిగ్‌బీ స్వయంగా తన బ్లాగ్ ద్వారా వెల్లడించారు. ముందుగా, గురు పౌర్ణమి సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన అభిమానులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం కేబీసీ కొత్త సీజన్ గురించి ప్రస్తావిస్తూ.. షోకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు ముగిశాయని వెల్లడించారు. "ఇక అసలైన పరీక్ష ఇప్పుడు మొదలవుతుంది. ఫైనల్ మార్క్స్ పూర్తయ్యాయి, ఇక ప్రొడక్షన్, ప్రేక్షకులదే బాధ్యత" అని పేర్కొంటూ సెట్స్ నుంచి కొన్ని ఫొటోలను పంచుకున్నారు. "ఈసారి మా ప్రోమోలో చెప్పినట్లుగా.. కాస్త గట్టిగా ఆలోచించాల్సిందే (జరా సోచ్‌నా పడేగా)" అంటూ కొత్త సీజన్ ట్యాగ్‌లైన్‌ను ప్రస్తావించి, షోపై ఆసక్తిని పెంచారు. ఆగస్టు 1 నుంచి ఈ కార్యక్రమ చిత్రీకరణ ప్రారంభం కానుండగా, ఆగస్టు 10 నుంచి సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్‌లో మొదటి ఎపిసోడ్ ప్రసారం కానుంది. ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన 'హు వాంట్స్ టు బీ ఏ మిలియనీర్?' కార్యక్రమానికి అధికారిక హిందీ అనుకరణే ఈ 'కౌన్ బనేగా కరోడ్‌పతి'. మూడో సీజన్‌కు షారుఖ్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరించగా, మిగిలిన అన్ని సీజన్లకు అమితాబ్ బచ్చనే వ్యాఖ్యాతగా కొనసాగుతూ ఈ షోకు ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చారు.

# వచ్చేసింది 'రామాయణ' ట్రైలర్..

## అంచనాలకు మించి విజువల్ వండర్!



భారత సినీ ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ'. ఎట్టకేలకు ఈ సినిమాకు సంబంధించిన తొలి భాగం ట్రైలర్‌ను ఈరోజు తెల్లవారుజామున చిత్రబృందం విడుదల చేసింది. రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్న ఈ చిత్ర ట్రైలర్, విడుదలైన క్షణం నుంచే సోషల్ మీడియాలో ప్రభంజనం సృష్టిస్తోంది. అద్భుతమైన విజువల్స్, భారీ తారాగణం, ఆకట్టుకునే నేపథ్య సంగీతంతో ట్రైలర్ అంచనాలను మించి ఉందని ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. 4.09 నిమిషాల నిడివితో కట్ చేసిన ఈ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. ముల్లోకాలకు అధిపతిని తానేనంటూ గర్వంగా ప్రకటించుకునే రావణుడి (యశ్) సంభాషణతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. లోకంలో అధర్మం పెరిగిపోతున్నప్పుడు, విష్ణువు రాముడి అవతారంలో భూమిపైకి వస్తాడు. రాముడి (రణ్‌బీర్) బాల్యం, రాక్షసులతో పోరాటాలు, సీతతో వివాహం వంటి ఘట్టాలను చూపించారు. ఆ తర్వాత 14 ఏళ్ల వనవాసం, లక్ష్మణుడితో కలిసి సీతారాములు అడవులకు వెళ్లడం, రావణుడు సీతను అపహరించడం వంటి కీలక సన్నివేశాలతో ట్రైలర్ కథపై ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్, నేపథ్య సంగీతం సినిమా స్థాయిని తెలియజేస్తున్నాయి. ఈ చిత్రంలో భారీ తారాగణం నటిస్తోంది. ఒకప్పటి 'రామానంద్ సాగర్' సీరియల్‌లో రాముడిగా మెప్పించిన అరుణ్ గోవిల్ ఇప్పుడు దశరథుడి పాత్రలో కనిపించడం విశేషం. హనుమంతుడిగా సన్నీడియోల్, లక్ష్మణుడిగా రవి దూబే, కౌసల్యగా ఇందిరా కృష్ణన్, కైకేయిగా లారాదత్త, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ తమ పాత్రల్లో ఒదిగిపోయారు. నిజానికి ఈ ట్రైలర్‌ను అధికారికంగా విడుదల చేయడానికి ముందే న్యూఢిల్లీలోని భారత్ మండపంలో, ముంబైలో, శాన్ డియాగో కామిక్-కాన్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఆ ఈవెంట్ల నుంచి కొన్ని క్లిప్స్ సోషల్ మీడియాలో లీక్ కావడంతో ట్రైలర్‌ను విడుదల చేయాలని అభిమానుల నుంచి తీవ్రమైన ఒత్తిడి వచ్చింది. ఈ నేపథ్యంలోనే మేకర్స్ అధికారికంగా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. నితీశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను నమితా మల్హోత్రా సుమారు రూ.4000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ చిత్రంలో 'రామాయణ: పార్ట్-1' ఈ ఏడాది దీపావళికి థియేటర్లలోకి రానుండగా, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు వస్తుంది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339